పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు

స్టార్ హోటళ్ల నిర్మాణానికి పెద్ద పెద్ద సంస్థల ఆసక్తి

అవసరమైన భూములు కేటాయించాల్సిందిగా జిల్లా అధికారులకు సూచించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

- సింహగిరిపై 'ప్రసాద్' పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తిచేయాలని ఆదేశం
- అరకులోయ, లంబసింగిల్లో పర్యాటక అభివృద్ధి పనులకు మరోసారి టెండర్లు పిలవాల్సిందిగా సూచన
- ఒకటో తేదీ నుంచి భూముల విలువల సవరణ




విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

అమరావతిలో రెండు రోజులు జిల్లా కలెక్టర్లతో సమీక్షలు నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, పథకాలపై దిశానిర్దేశం చేశారు. విశాఖ జిల్లాకు సంబంధించి పర్యాటక అభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలని ఆదేశించారు.పెద్దపెద్ద సంస్థలు విశాఖపట్నంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి స్టార్ హోటళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపుతున్నాయని, వాటికి అవసరమైన భూములు కేటాయించాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో పర్యాటక రంగంలో చేపడుతున్న పనులను సమీక్షించారు.

'ప్రసాద్' పథకం కింద సింహాచలం దేవస్థానం అభివృద్ధికి కేంద్రం రూ.54 కోట్లు ఇవ్వగా ఇప్పటివరకు కేవలం 61 శాతం మాత్రమే పనులు జరిగాయని, మిగిలిన పనులు 2025 మార్చి నాటికి పూర్తి చేయాలని స్పష్టంచేశారు. స్వదేశీ దర్శన్ 2.0 పథకం కింద అరకులోయ, లంబసింగిలలో పర్యాటక అభివృద్ధికి రూ.29.87 కోట్లు మంజూరుచేశారని, అయితే ఈ పనులకు టెండర్లు పిలిస్తే ఎవరూ రాలేదని అధికారులు చెప్పడంతో, వెంటనే మరోసారి టెండర్లు పిలవాలని సూచించారు.

రిజిస్ట్రేషన్ల శాఖకు రూ.522.62 కోట్ల లక్ష్యం

విశాఖపట్నం జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై సమీక్షించినప్పుడు లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నట్టు గుర్తించారు. కనీసం ఈ నాలుగు నెలలైనా లక్ష్యానికి మంచి రాబడి తీసుకురావాలని సూచించారు. డిసెంబరు నెలలో రూ.117.77 కోట్లు, జనవరిలో 110.41 కోట్లు, ఫిబ్రవరిలో 132.5 కోట్లు, మార్చిలో రూ.161.914 కోట్లు మొత్తం రూ.522.62 కోట్లు వసూలు చేయాలని నిర్దేశించారు. జనవరి నుంచి సవరించిన భూముల మార్కెట్ విలువలు అమలు చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. వీటికి సంబంధించి ఈ నెల 15న ... మిగతా 6వ పేజీలో

విశాఖపట్నంతో పాటు అమరావతి, తిరుపతి, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టడానికి పలు సంస్థలు ముందుకువచ్చాయి. వాటి వివరాలు...

సంస్థ	పెట్టుబడి	ప్రాంతం/భూమి	ఉపాధి
రహేజా గ్రూపు	---	బీచ్ ఫ్రంట్, 15 ఎకరాలు	
మహీంద్రా	---	భీమిలి, 55 ఎకరాలు	
ఐహెచ్‌సీఎల్	రూ.428 కోట్లు	భీమిలి	
రహేజా గ్రూపు	---	రామానాయుడు స్టూడియో, 5 ఎకరాలు	
అట్మాస్ఫియర్	రూ.1,200 కోట్లు	యారాడ, 10 ఎకరాలు	
ఐహెచ్‌సీఎల్	---	యారాడ	
మే ఫెయిర్ హోటల్	రూ.400 కోట్లు		1,750
ఒబెరాయ్	రూ.2,100 కోట్లు		15,000
ఐఆర్‌సీటీసీ	రూ.400 కోట్లు		1,000

76.1 శాతం ఇళ్లకు కొళాయిల ద్వారా నీరు



- చెత్త నిర్వహణ శతశాతం
- జీవీఎంసీలో 95 శాతం ఇళ్ల నుంచి చెత్త సేకరణ
- జిల్లా కలెక్టర్ల సదస్సులో సీఎంకు అధికారుల ప్రజంటేషన్
- రోడ్ల నిర్వహణ గ్లోబల్ టెండర్ల ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగింత

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

చెత్తను శతశాతం పునర్వినియోగం జరిగేలా చేయడంలో జీవీఎంసీ విజయవంతమైంది. ఈనెల 11, 12 తేదీల్లో అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో రాష్ట్ర పురపాలన, పట్టణాభివృద్ధి శాఖపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. స్థానిక పట్టణ సంస్థల్లో ఉత్పత్తి అవుతున్న చెత్త నిర్వహణ రాష్ట్రవ్యాప్తంగా సగటున 60.9 శాతం మాత్రమే జరుగుతుండగా, జీవీఎంసీ పరిధిలో మాత్రం శతశాతం చేస్తున్నట్టు అధికారులు సీఎం చంద్రబాబునాయుడుకు వివరించారు. అలాగే కొళాయిల ద్వారా నీటి సరఫరా రాష్ట్రంలో 64.2 శాతం ఇళ్లకు జరుగుతుండగా, జీవీఎంసీలో 76.1 శాతం ఇళ్లకు సరఫరా చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరణ రాష్ట్ర స్థాయిలో 86.5 శాతం మాత్రమే జరుగుతుండగా, జీవీఎంసీ పరిధిలో 95 శాతం ఇళ్ల నుంచి చెత్త సేకరణ జరుగుతున్నట్టు పేర్కొన్నారు. డంపింగ్ యార్డుల్లో ఏళ్ల తరబడి పేరుకుపోయిన చెత్త (లెగసీవేస్ట్)ను వెలికితీసి పునర్వినియోగానికి ఉపయోగపడేలా చేసే ప్రక్రియ రాష్ట్రస్థాయిలో 54.2 శాతం జరుగుతుంటే జీవీఎంసీ పరిధిలో 97.5 శాతం జరుగుతోందని వివరించారు. అదేవిధంగా వ్యర్థ జలాల నిర్వహణ రాష్ట్రస్థాయిలో 28.4 శాతం ఉంటే జీవీఎంసీ పరిధిలో 91.5 శాతం జరుగుతున్నట్టు వివరించారు. వరద నీటి ... మిగతా 6వ పేజీలో

పాల ఉత్పత్తిలో విశాఖ ఫస్ట్

విశాఖపట్నం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి):




విశాఖపట్నం జిల్లా ఆవు పాల ఉత్పత్తిలో ప్రథమ, గేదె పాల ఉత్పత్తిలో ద్వితీయ స్థానంలో ఉంది. రోజుకు సగటున ఒక ఆవు నుంచి 10.51 లీటర్లు, గేదె నుంచి 9.69 లీటర్లు పాలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈనెల 11, 12 తేదీల్లో విజయవాడలో జరిగిన కలెక్టర్ల సదస్సులో విశాఖ జిల్లాకు సంబంధించి పలు శాఖల పురోగతి, అభివృద్ధిపై చర్చించారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ నివేదించిన వివరాలు ఇలా ఉన్నాయి. పాల ఉత్పత్తి అనగానే చిత్తూరు, కృష్ణా, ప్రకాశం, గుంటూరు, గోదావరి జిల్లాలు గుర్తుకువస్తాయి. అయితే ఆవు పాల ఉత్పత్తిలో విశాఖ జిల్లా మొదటి స్థానంలో ఉంది. గేదె పాల ఉత్పత్తిలో పశ్చిమ గోదావరి జిల్లా 9.965 లీటర్లతో మొదటి స్థానంలో ఉండగా, 9.697 లీటర్లతో విశాఖపట్నం రెండో స్థానంలో నిలిచింది. విశాఖ జిల్లాలో 12,800 మంది రైతుల వద్ద 42 వేల ఆవులు, 25 వేల గేదెలు ఉన్నాయి.

2.4 లక్షల మంది డేటా మిస్సింగ్



ఆధార్ కార్డు అమలులోకి వచ్చిన తరువాత ప్రతి పౌరుడి వివరాలు ప్రభుత్వం వద్ద నిక్షిప్తం అవుతున్నాయి. అయితే జిల్లాలో 2,43,669 మంది డేటా మిస్ అయినట్టు అధికారులు చెబుతున్నారు. అందులో 2,743 మంది వివరాలు సచివాలయాల ద్వారా అప్‌లోడ్ చేయగా, ఇంకా 2,40,926 మంది (98.87 శాతం) వివరాలు సేకరించాల్సి ఉంది. ఇక, ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారుల్లో 4,03,374 మంది బ్యాంకు ఖాతాల ద్వారా ఎటువంటి లావాదేవీలు నిర్వహించడం లేదని గుర్తించారు. ప్రతి ఒక్కరూ లావాదేవీలు నిర్వహించేలా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటివరకూ 3,84,030 ఖాతాలు యాక్టివ్ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే జిల్లాలో 7,17,323 ఇళ్లు ఉండగా ఇప్పటివరకూ 6,7,645 (94.47 శాతం) ఇళ్ల ఫొటోలు తీసి జియోట్యాగింగ్ చేశారు. మిగిలిన 39,678 ఇళ్ల ఫొటోలు తీసే పని ఈనెల 15లోగా పూర్తిచేయాలని ఉన్నతాధికారులు సూచించారు. జిల్లాలో 18,990 మంది పిల్లలకు ఆధార్ కార్డులు లేవని గుర్తించారు.

గృహ నిర్మాణంలో చివరి స్థానం



ఇళ్ల నిర్మాణాల్లో విశాఖ జిల్లా చివరి స్థానంలో ఉంది. డిసెంబరు నెలాఖరులోగా రాష్ట్రంలో 1.25 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలని గత కలెక్టర్ల సదస్సులో నిర్ణయించారు. అందులో విశాఖ జిల్లాకు సంబంధించి 6,903 ఇళ్లు పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించగా 2,813 (41 శాతం) పూర్తిచేశారు. వచ్చే జనవరి ఒకటో తేదీ నుంచి మార్చి 31వ తేదీలోగా జిల్లాలో 10,058 ఇళ్లు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

నగరంలో కాలుష్యం తగ్గాల్సిందే...



విశాఖ నగరంలో కాలుష్య తీవ్రత తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దేశంలో సగటు కాలుష్యం కంటే తక్కువ నమోదుకావాలని ఆదేశించింది. ప్రధానంగా గాలిలో ధూళి కణాలు తగ్గించేలా చూడాలని ... మిగతా 6వ పేజీలో

వైసీపీ నేతపై మహా ప్రేమ

ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అడ్డగోలుగా నిర్మాణాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ అధికారులు ఇంకా వైసీపీ ప్రభుత్వమే ఉందన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. గాజువాక ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఒకరు నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థు నిర్మించినా, పార్కింగ్‌కు కేటాయించాల్సిన సెల్లార్ హోటల్‌కు ఇచ్చినా అడ్డుచెప్పడం లేదు. దీనిపై ఆ భవనంలోని ఫ్లాట్‌ల యజమానులు జీవీఎంసీ అధికారులకు మౌఖికంగా ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

- పార్కింగ్‌కు కేటాయించాల్సిన సెల్లార్‌లో హోటల్ ఏర్పాటు
- నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థు నిర్మాణం
- నాడే జీవీఎంసీకి ఫిర్యాదు చేసిన ఫ్లాట్ల యజమానులు
- పట్టించుకోని అధికారులు
- ఇప్పుడూ అదే పరిస్థితి
- కూటమి ప్రభుత్వం వచ్చినా మారని తీరు

జీవీఎంసీ 71వ వార్డు పరిధి వడ్లపూడి శ్రీరామ్‌నగర్‌లో జాతీయ రహదారికి అనుకుని వైసీపీ నేత ఒకరు తొమ్మిదేళ్ల కిందట భారీ అపార్టుమెంటు నిర్మించారు. బేస్‌మెంట్+సెల్లార్+గ్రౌండ్+4 తరహా నిర్మాణం చేపట్టనున్నట్టు బ్రోచర్ విడుదల చేయడంతో చాలామంది ఫ్లాట్‌లు కొనుగోలు చేశారు. ఒక బ్లాక్‌లో 40 ఫ్లాట్‌లు నిర్మించి, రోడ్డు ఫేసింగ్ కలిగిన మరో బ్లాక్‌లో వాణిజ్య అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టి..తన వద్దనే ఉంచుకున్నారు. అపార్టుమెంటు బేస్‌మెంట్‌తోపాటు సెల్లార్‌ను పూర్తిగా పార్కింగ్ కోసం కేటాయించాలి. అయితే అపార్టుమెంటు నిర్మించిన వ్యక్తి మాజీ ప్రజా ప్రతినిధి కావడంతోపాటు వైసీపీలో క్రియాశీలకంగా వ్యవహరించడంతో తన అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ సెల్లార్‌లో 70 శాతం స్థలంలో హోటల్ ఏర్పాటు చేసి, మిగిలిన ఖాళీగా తనకు ప్రత్యేకంగా కార్యాలయం నిర్మించుకున్నారు. దీనిపై అభ్యంతరం వ్యక్తంచేయడంతోపాటు సెల్లార్‌లో నిర్మాణాలను తొలగించాల్సిన ... మిగతా 6వ పేజీలో



పార్కింగ్‌కు వాడాల్సిన సెల్లార్‌లో హోటల్ నిర్వహణ

రైళ్లు ఫుల్

సంక్రాంతి సమయంలో బెర్తులు లభించే పరిస్థితి లేదు

- బెంగళూరు, చెన్నై రైళ్లకు మరీ డిమాండ్
- జనవరి 22, 26 తేదీల వరకూ ముందే రిజర్వు
- సికింద్రాబాద్ వచ్చే రైళ్లకు పండుగ ముందు, విశాఖ నుంచి వెళ్లే రైళ్లకు పండుగ తరువాత చాంతాడంత నిరీక్షణ జాబితా
- హౌరా రైళ్లకూ అదే పరిస్థితి



విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి సమయంలో రైళ్లకు తీవ్రమైన డిమాండ్ కనిపిస్తోంది. బెంగళూరు వెళ్లే రైళ్లలో జనవరి 26వ తేదీ వరకు, హౌరా, చెన్నై రైళ్లలో జనవరి 22 వరకూ బెర్తులు లభించే పరిస్థితి లేదు. ఇక సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వచ్చే రైళ్లలో జనవరి ఏడు నుంచి 14వ తేదీ వరకూ బెర్తులు ఖాళీ లేవు. పండగ ముందు విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లే రైళ్లలో బెర్తులు లభిస్తున్నాయి. జనవరి 17 నుంచి 21 వరకూ సికింద్రాబాద్ వెళ్లే రైళ్లలో బెర్తులు రిజర్వు అయిపోయాయి.

26 వరకు బెంగళూరు రైళ్లు ఫుల్

భువనేశ్వర్-బెంగళూరు ప్రశాంతి (18463), హౌరా-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ (12863) వంటి ప్రతిరోజూ నడిచే రైళ్లలో జనవరి 26 వరకూ బెర్తులు రిజర్వు అయిపోయాయి. భువనేశ్వర్-బెంగళూరు హంసఫర్ (22833), హౌరా-బెంగళూరు హంసఫర్ (22887), హౌరా-బెంగళూరు దురంతో (12245), హటియా-బెంగళూరు (12835), గుహవటి-బెంగళూరు (12510), భగల్‌పూర్-బెంగళూరు అంగా ఎక్స్‌ప్రెస్ (12254), అగర్తాలా-బెంగళూరు (12504), కామాఖ్య-బెంగళూరు (12552), పూరి-యశ్వంత్‌పూర్ గరీబ్‌రథ్ (22833), టాటా-యశ్వంత్‌పూర్ (18111), జసిదిన్ జంక్షన్-బెంగళూరు (22306), టాటా-బెంగళూరు (12889), హౌరా-మైసూర్ (22817), భువనేశ్వర్-బెంగళూరు (12845), హటియా-బెంగళూరు (18637), న్యూటిన్సుకియా-బెంగళూరు (22502), హౌరా-బెంగళూరు ఏసీ ఎక్స్‌ప్రెస్ (22863), ముజాఫర్‌పూర్-బెంగళూరు (15228) రైళ్లలో కూడా జనవరి 27 వరకూ బెర్తులు లభించే పరిస్థితి లేదు. కాగా భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రతి ఆదివారం నడుస్తున్న ప్రత్యేక ఏసీ ఎక్స్‌ప్రెస్‌కు మాత్రం ప్రస్తుతం బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

చెన్నై రైళ్లకు డిమాండ్

కోరమండల్ (12841), మెయిల్ (12839), బొకారో (13351) వంటి రెగ్యులర్ ... మిగతా 6వ పేజీలో

వైసీపీ నిరసన



రైతులకు పెట్టుబడి సాయం కింద ఏటా రూ.20 వేలు చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైసీపీ నేతలు శుక్రవారం 'రైతన్నకుతోడుగా' పేరుతో జడ్పీ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో నాయకులు డీఆర్వోకు వినతిపత్రం సమర్పించారు. - వార్త 8లో

ఆయుష్ హబ్‌గా విశాఖ

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

- విమ్స్‌లో త్వరలో నేచురోపతి మెడికల్ కాలేజీ
- అదే ప్రాంగణంలో 50 పడకలతో ఆయుష్ ఆస్పత్రి
- శొంఠ్యాంలో సుమారు రూ.7 కోట్లతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్
- ఖాళీలతో సేవలపై ప్రభావం.. ఉన్నతాధికారులు దృష్టికి ఇబ్బందులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఆయుష్ విభాగ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ దానేటి ఝాన్సీ లక్ష్మి



దానేటి ఝాన్సీ లక్ష్మి

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి):

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయుష్ విభాగాన్ని బలోపేతం చేయడంపై దృష్టిసారించాయని, అందులో భాగంగా విశాఖకు ప్రాధాన్యం ఇస్తున్నాయని రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ దానేటి ఝాన్సీ లక్ష్మి పేర్కొన్నారు. కొద్దిరోజుల కిందట బాధ్యతలు స్వీకరించిన ఆమె శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధితో మాట్లాడారు. తమ విభాగం ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలు, భవిష్యత్తు ప్రణాళిక గురించి వివరించారు. ఆయుర్వేద, యునాని, సిద్ధ, హోమియో విభాగాలను కలిపి ఆయుష్‌గా పేర్కొంటూ సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. రీజనల్ కార్యాలయ పరిధిలోని ఆరు జిల్లాల్లో 144 (31 ఎన్ఆర్‌హెచ్ఎం) డిస్పెన్సరీలు ఉన్నాయన్నారు. వాటిలో 22 డిస్పెన్సరీలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలుగా అప్‌గ్రేడ్ చేసి మెరుగైన సేవలు అందిస్తున్నట్టు వెల్లడించారు. మరో ఐదు పంచకర్మ సెంటర్లు ఉన్నాయని వివరించారు. ఒక్కో డిస్పెన్సరీకి ప్రతిరోజూ కనీసం 50 మంది వరకు రోగులు వస్తుంటారన్నారు. గతంతో పోలిస్తే రోగుల ... మిగతా 6వ పేజీలో


చెరువు వద్ద వేసిన శిలాఫలకం

అభివృద్ధికి నోచుకోని చిల్లపేట చెరువు

తగరపువలస,డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస, భీమిలి రహదారి మధ్యలో ఉన్న చిల్లపేట చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు. గతంలో గంటా శ్రీనివాసరావు భీమిలి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చెరువు అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. రూ. 1.90 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడానికి శంకుస్థాపన కూడా చేశారు. చెరువు చుట్టూ రహదారి నిర్మించడంతో పాటు బోటు షికారు, పార్కు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కానీ గట్టును ఎత్తు చేసి, మట్టి రోడ్డు మాత్రమే వేశారు. ఎన్నికల వల్ల మిగిలిన పనులు నిలిచిపోయాయి. టీడీపీ ప్రభుత్వం మారిన తరువాత వైసీపీ హయాంలో చెరువు పూడికతీత కొంతమేర చేపట్టి విడిచిపెట్టారు. చెరువు చుట్టూ ఆక్రమణలను తొలగించలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి చెరువు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

యూపీహెచ్‌సీ సేవలపై ఆరా

కొమ్మాది, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెంలో ఉన్న అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని టీడీపీ నాయకులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు వైద్యులతో మాట్లాడి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పరిసరాల శుభ్రత గురించి స్థానికులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రోగులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది ఆసుపత్రి వద్ద ఉన్న డ్రైనేజీపై పలకలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పడంతో వెంటనే జోన్-2 అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆరో వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, సీనియర్ నాయకుడు సర్వ దేవుళ్లు, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై దుకాణాల తొలగింపు

తగరపువలస,డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస కూడలి నుంచి వైఎస్‌ఆర్ జంక్షన్ వరకు రహ దారికి ఇరువైపులా ఉన్న దుకాణాలను జీవీఎంసీ అధికారులు శుక్రవారం తొలగించారు. అధికారులు ముందుగా ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉన్న వ్యాపారులతో మాట్లాడి దుకాణాలను తొలగించాలని కోరారు. ఈ సందర్భంగా జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. మహాలక్ష్మినాయుడు మాట్లాడుతూ కొత్త ఏడాది నుంచి ప్లాస్టిక్ సంచులను పూర్తిగా నిషేధిస్తున్నామని చెప్పారు. వాటిని ఎవరు ఉపయోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ అసిస్టెంట్ అమిత్ ప్రదాన్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు చేపట్టారు. రక్త పరీక్షలు, ఎత్తు, బరువు, తల, ఛాతీ చుట్టు కొలత, దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రసాదరావు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పద్మనాభం రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం జరిగే నీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నీటిపారుదల శాఖ డీఈ జె. స్వామినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.ఇప్పటికే ఓటర్ల జాబితాలను ఆయా సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. నియోజకవర్గంలో 16 సాగు నీటి సంఘాలు ఉండగా, భీమిలిలో 5, ఆనందపురంలో 4, పద్మనాభంలో 7 సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

వైభవంగా అమ్మవార్ల తిరువీధి



సింహాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో సువర్ణ, చతుర్భుజి అమ్మవార్ల తిరువీధి శుక్రవారం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్ల ఉత్సవమూర్తులను పలు రకాల పుష్పమాలికలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి పల్లకిలో ఉంచారు. ఆలయ నాదస్వర విద్వాంసుల వాయిద్యాలు, పండితుల వేదపఠనాల నడుమ బేడా మండపంలో ప్రదక్షిణలు జరిపారు. మార్గం పొడవునా భక్తులు పూజలు చేశారు.


కాపులుప్పాడ సదస్సులో వినతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



అయినాడలో రైతుల నుంచి వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆనందరావు

రెవెన్యూ సదస్సులు మొక్కుబడిగా నిర్వహించొద్దు

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను అధికారులు మొక్కుబడిగా నిర్వహించరాదని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. శుక్రవారం 4వ వార్డు కాపులుప్పాడలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సులను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చిన ప్రతి వినతికి 45 రోజుల్లో పరిష్కారం లభించేలా చర్యలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, ఆర్‌డీఓ సంగీత్ మాధుర్, తహసీల్దార్ రామారావు, జోనల్ కమిషనర్ ప్రసన్న వాణి, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : పెద్ద రుషికొండ స్వర్ణభారతి నగర్ సామాజిక భవనంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా చినగదిలి రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్ భూ సమస్యలపై స్థానికుల నుంచి 36 వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, టీడీపీ నాయకుడు అక్కరబోయిన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : అయినాడలో రైతులు వ్యవసాయ పనుల వల్ల పొలాల్లో ఉండడంతో రెవెన్యూ అధికారులు నేరుగా వారి వద్దకు వెళ్లి దరఖాస్తులు తీసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దారు కె. ఆనందరావు వరి కోత కోస్తున్న మహిళల వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన సదస్సులో పాల్గొని రైతుల నుంచి వినతులు స్వీకరించారు. గ్రామంలోని ప్రభుత్వ భూములను పరిశీలించి వాటి పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై వీఆర్వోకు సూచనలు ఇచ్చారు. మొత్తం 27 వినతులు రాగా మ్యుటేషన్‌కు 12, సర్వే కోసం 12, కుల ధ్రువీకరణ పత్రం కోసం రెండు, ఇతర దరఖాస్తు ఒకటి వచ్చాయి. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రశేఖర్, ఆర్‌ఐ శ్యామల, తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

తూతూమంత్రంగా ప్రజా వేదిక

పద్మనాభం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పను లకు సంబంధించి సామాజిక తనిఖీల బృందం శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించారు. అధికారులకు, సామాజిక తనిఖీ సిబ్బంది మధ్య నివేదిక ప్రకటనపై స్వల్ప వాదనలు మినహా మిగతా సమావేశమంతా తూతూమంత్రంగా సాగింది. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు రూ.14.06 కోట్ల ఉపాధి నిధులతో చేపట్టిన పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికను ప్రజా వేదికలో అధికారులు వివరించారు. కొందమంది బినామీ పేర్లకు జరిపిన ఉపాధి కూలీ చెల్లింపులపై నివేదికలో తెలిపారు. కన్నయ్య కోనేరు గట్టుపై వేసిన కొబ్బరి మొక్కలు కనిపించకపోవడంపై సామాజిక తనిఖీ అధికారులు గుర్తించగా, అనంత పద్మనాభస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా నిర్వహించిన తెప్పోత్సవంలో భక్తుల తాకిడికి పాడయ్యాయని వీఆర్‌పీ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ ఆర్. పూర్ణిమాదేవి, విజిలెన్సు అధికారి నిర్మలాదేవి, ఏపీడీ ఆంజనేయులు ఎంపీడీఓ విజయకుమార్, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ ఆలయ పునఃప్రారంభోత్సవం


పూజలో పాల్గొన్న ఈఓ త్రినాథరావు దంపతులు

సింహాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అడివివరం గ్రామ దేవత బంగారమ్మ తల్లి ఆలయం పునః ప్రారంభోత్సవాలు శుక్రవారం నుంచి మొదలయ్యాయి. ఆలయం జీర్ణావస్థకు చేరుకోవడంతో రూ. 35 లక్షలతో కొత్తగా నిర్మాణం చేపట్టారు. ఈమేరకు శనివారం నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం వేద పండితుడు కాళకూరి వెంకట సుబ్రహ్మణ్యశర్మ సారధ్యంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. తరువాత యాగశాల ప్రదక్షిణ, యాగశాల ప్రవేశం జరిపి యాగాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ వేండ్ర త్రినాథరావు సతీసమేతంగా పాల్గొన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ ప్రేమ్ కుమార్

టెన్త్‌లో శత శాతం ఉత్తీర్ణత లక్ష్యం కావాలి : డీఈఓ

ఆనందపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయుల పాఠాలను బోధించాలని డీఈఓ ప్రేమ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన వంద రోజుల ప్రణాళికను అమలు చేసి, శత శాతం ఫలితాలు సాధించాలని చెప్పారు. మరుగుదొడ్ల నిర్వహణ, పాఠశాల రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓతో పాటు ఎంఈవో కె. గంగరాజు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగంపై అవగాహన



అవగాహన సదస్సులో పాల్గొన్న అధికారులు

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నివాసితులు సోలార్ విద్యుత్ వినియోగించడం వల్ల డబ్బు ఆదా కావడంతో పాటు పర్యావరణానికి మేలు జరుగుతుందని ఏపీఈపీడీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యామ్‌బాబు అన్నారు. శుక్రవారం ఆయన చిప్పాడ కల్యాణ మండపంలో పీఎం సూర్యఘర్ పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకానికి మండలానికి రెండు గ్రామాలను మోడల్‌గా ఎంపిక చేస్తున్నామన్నారు. సోలార్ విద్యుత్ వినియోగించే వారికి 50 శాతం రాయితీతో పాటు బ్యాంకు రుణం కూడా లభిస్తుందని చెప్పారు. గ్రామంలో అందరూ సోలార్ ప్యానెళ్లు వేసుకుంటే కేంద్రం రూ. కోటి అందిస్తుందని చెప్పారు. ఆ శాఖ ఈఈ పోలాకి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మీపతిరాజు, ఏడీఆర్ రమేశ్, చిట్టివలస సహాయ ఇంజనీర్ హరికుమార్, జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, పాల్గొన్నారు.

ఆయుష్ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విశాఖను ఆయుష్ హబ్‌గా మార్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ప్రాజెక్టులను కేటాయిస్తున్నాయన్నారు. విమ్స్‌లో నేచురోపతి మెడికల్ కాలేజీ ఏర్పాటవుతోందన్నారు. భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. అదే ప్రాంగణంలో 50 పడకలతో ఆయుష్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనివల్ల ఇన్‌పేషెంట్లుగా కూడా చేర్చుకుని సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా శొంఠ్యాంలో సుమారు ఏడు కోట్ల రూపాయలు వ్యయంతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని 23 డిస్పెన్సరీల అభివృద్ధికి మూడు లక్షలు రూపాయల చొప్పున నిధులను మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఆరు జిల్లాల్లోని డిస్పెన్సరీల్లో పలు కేడర్లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీచేయడం వల్ల మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఖాళీలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

డిస్కమ్‌లపై ఇంజనీర్లకు అవగాహన

డాబాగార్డెన్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ కాపర్ అసోసియేషన్ ఇండియా (ఐసీఏఐ), ఇండియన్ ట్రాన్స్‌ఫార్మర్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ సంయుక్తంగా శుక్రవారం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేషన్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా షిర్డీసాయి ఎలక్ట్రికల్స్ గ్రూప్ సీఈఓ ఎస్‌సీ కొల్లా, ఐసీఏఐ ఎనర్జీ రెగ్యులేటరీ వ్యవహారాల సలహాదారు మనస్ కుందు, ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) వి. విజయ లలిత పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లు కీలకమైన ఆస్తులుగా ఉంటాయని తెలియజేశారు. డిస్కమ్‌ల ఇంజనీర్లకు అవగాహన కల్పించేందుకు ఈ తరహా సదస్సులు ఉపకరిస్తాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వైఫల్యాలు, మరమ్మతుల ఖర్చులు పెరగడం వంటి సవాళ్లపైనా చర్చించారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరాను నిర్ధారించడానికి నాలెడ్జ్ షేరింగ్ సమావేశాల ప్రాముఖ్యతను వివరించారు.

ఏయూ ఖ్యాతిని పెంచండి

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళల ఖోఖో చాంపియన్ షిప్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. ఏయూ స్పోర్ట్సు ఎరీనాలో జరుగుతున్న ఈ పోటీలకు ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా గుర్తింపు పొందిన ఖోఖోకు విశేష ఆదరణ ఉందని పేర్కొన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో ఆడి జాతీయ టోర్నీలో ఏయూ ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు.టోర్నీలో ఏయూ గుర్తింపు పొందిన ఎంఏఎల్ కాలేజీ (అనకాపల్లి), ఎంఆర్ కాలేజీ (విజయనగరం), జీడీసీ నక్కపల్లి, ఎస్వీఎల్‌ఎన్‌ఎస్ భీమిలి, వీఎంసీ కాలేజీ, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ, వీజీడీసీ మహిళా కాలేజీ, సెయింట్ ఆన్స్ కాలేజీ, ప్రగతి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితర జట్లు పాల్గొంటున్నాయని డాక్టర్ ఎ. పల్లవి తెలిపారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

రైళ్లతోపాటు విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22801), హౌరా-కన్యాకుమారి (12665), భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), భువనేశ్వర్-చెన్నై సూపర్‌ఫాస్ట్ (12830), టాటా-ఎర్నాకులం (18189), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825) రైళ్లకు జనవరి 22వ తేదీ వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. విశాఖ మీదుగా చెన్నై వెళ్లే మెయిల్, కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనవరి 13వ తేదీన కొన్ని బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

జనవరి 17 నుంచి 21 వరకూ సికింద్రాబాద్ ఫుల్

సికింద్రాబాద్ వెళ్లే గోదావరి (12727), విశాఖ (17015), గరీబ్‌రథ్ (12739), ఫలక్‌నూమా (12703), జన్మభూమి (12805), ఈస్ట్‌కోస్ట్ (18045), దురంతో (22203), ఎల్‌టీటీ (18519), వందేభారత్ (20833), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు సంబల్‌పూర్-నాందేడు (20809), విశాఖ-నాందేడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బెర్తులు జనవరి 21 వరకూ రిజర్వు అయిపోయాయి.

హౌరా రైళ్లకు డిమాండ్

విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నూమా (12704), చెన్నై-హౌరా కోరమండల్ (12842), చెన్నై-హౌరా మెయిల్ (12840), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ (18046), బెంగళూరు-హౌరా (12864) రైళ్లతోపాటు వారానికి ఒకరోజు, రెండు రోజులు అందుబాటులో ఉండే విశాఖ-షాలిమార్ (22854), వాస్కోడిగమ-షాలిమార్ (18048), తిరుచరాపల్లి-హౌరా (12664), చెన్నై-సంత్రాగచ్చి (22808), పాండిచ్చేరి-హౌరా (12868), చెన్నై-షాలిమార్ (22826), బెంగళూరు-గుహవటి (12509), బెంగళూరు-హౌరా (22864), బెంగళూరు-హౌరా (22888), త్రివేండ్రం-షాలిమార్ (22641), సికింద్రాబాద్-షాలిమార్ (22850), బెంగళూరు-హౌరా దురంతో (12246), కన్యాకుమారి-హౌరా (12666), తిరుపతి-హౌరా హంసఫర్ (20890), మైసూర్ జంక్షన్-హౌరా 22818), మంగుళూరు-సంత్రాగచ్చి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22852), నాగర్‌కోయిల్-షాలిమార్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12659), తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22856) రైళ్లలో థర్డ్ ఏసీ, స్లీపర్ బెర్త్‌లు అయిపోగా, ఫస్ట్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌లలో అందుబాబులో ఉన్నాయి. కాగా విశాఖ-షాలిమార్ మధ్య మంగళవారం నడిచే ప్రత్యేక రైలులో (08508) బెర్తులు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రైళ్లకు సంక్రాంతి తర్వాత రోజుల్లో ఏసీ కోచ్‌లలో బెర్తులు లభించే పరిస్థితి ఉంది.

76.1 శాతం ఇళ్లకు కొళాయిల ద్వారా నీరు

... 5వ పేజీ తరువాయి

కాలువల నిర్వహణ రాష్ట్రస్థాయిలో 42.7 శాతం ఉంటే, జీవీఎంసీ పరిధిలో 44.6 శాతం ఉందని అధికారులు ప్రజెంటేషన్‌లో వివరించారు. వీధి దీపాలు రాష్ట్రస్థాయిలో 91.4 శాతం లైట్లు వెలుగుతుంటే, జీవీఎంసీ పరిధిలో 95 శాతం వెలుగుతున్నట్టు వివరించారు. జీవీఎంసీ పరిధిలో రోడ్లపై 2,783 చోట్ల మరమ్మతు పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకూ 2,242 పనులు పూర్తిచేసినట్టు, మిగిలిన 541 పనులు వివిధ దశల్లో ఉన్నట్టు చూపించారు. పైలట్ ప్రాజెక్టు కింద విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌తోపాటు జీవీఎంసీ పరిధిలోని 642 కిలోమీటర్ల రోడ్ల నిర్వహణను గ్లోబల్ టెండర్ల ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్టు అధికారులు వివరించారు.

పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు

... 5వ పేజీ తరువాయి

తొలి సమావేశం, 23న మరో సమావేశం నిర్వహించి విలువలు ఖరారు చేయాలన్నారు.

భూముల రీసర్వే ఫిర్యాదులపై దృష్టి

ఇటీవల గ్రామాల్లో భూములను రీ సర్వే చేశారని, అయితే వాటిపై ఫిర్యాదులు పెద్దఎత్తున వస్తున్నందున వాటిని పరిష్కరించాలని సీఎం సూచించారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఇప్పటివరకూ 51 గ్రామాల్లో సభలు నిర్వహించగా 3,195 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 330 పరిష్కరించగా, ఇంకా 2,885 పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. వాటిని 31 మార్చి నాటికి క్లియర్ చేయాలని సీఎం సూచించారు.

జమిలి ఎన్నికలపై కేంద్ర నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జమిలి ఎన్నికలకు అనుకూలంగా కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఎన్డీఏ ప్రధాన భాగస్వామ్యపక్షంగా స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మధురవాడ శిల్పారామంలో చేనేత మేళాను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏటా ఎక్కడో ఒకచోట ఎన్నికల నిర్వాహణ వల్ల పరిపాలన నెమ్మదిస్తుందన్నారు. ఒక దేశం-ఒక ఎన్నిక..విధానం వల్ల ఆ ఇబ్బందిని అధిగమించవచ్చునన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇప్పటికే నివేదిక ఇచ్చిందని, పార్లమెంటులో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. ముత్తంశెట్టి రాజీనామాపై మీడియా అడిగిన ప్రశ్నకు బదిలిస్తూ..వైసీపీ అధికారం కోల్పోయినందున రాజీనామా చేసి ఉండవచ్చునని వ్యాఖ్యానించారు. ఆయన ఏ పార్టీలో చేరుతారో ఆయన ఆప్షన్ అన్నారు.

సంప్రదాయబద్ధంగా హనుమత్ వ్రతం


సాక్షి ఆంజనేయస్వామికి పూర్ణాహుతి సమర్పిస్తున్న ఏఈఓ ఆనందకుమార్


కొమ్మాదిలో పలు రకాల పండ్లతో స్వామివారి అలంకరణ

సింహాచలం, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మెట్ల మార్గంలో కొలువుదీరిన సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో హనుమత్ వ్రతం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 నుంచి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. 7.30 గంటలకు హనుమ సహస్రనామావళితో లక్ష తమలపత్ర పూజ జరిపారు. 9 గంటలకు రామాయణంలోని పట్టాభిషేక సర్గ విన్నపాలు చేశారు. తరువాత ప్రత్యేక హోమాలు నిర్వహించి, మహా పూర్ణాహుతి జరిపారు. సింహాచలం పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు ఆంజనేయస్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్య క్రమంలో దేవాలయ ఏఈఓ నక్కాన ఆనందకుమార్, పీఆర్‌ఓ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : సాగరేశ్వరాలయం ఆవరణలో ఉన్న హనుమాన్ ధ్యాన మందిరంలో హనుమత్ వ్రతం సం దర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు పీసపాటి శ్రీనివాసా మారుతి రాఘవన్ ఆధ్వర్యంలో ఈ పూజలు చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

కొమ్మాది : చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతం ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవ అనంతరం స్వామివారికి ప్రత్యేక పూ జలు, అభిషేకాలు జరిపారు. అనంతరం దానిమ్మ, నారింజ, జామ, పైనాపిల్, రేగు, చెర్రీస్, సీతాఫలం, తదితర పలు రకాల పండ్లతో స్వామివారిని అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు సుందరాకాండ పారాయణం, హనుమాన్ చాలీసా, భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, కార్యదర్శి తాతారావు, కృష్ణమూర్తి పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : పట్టణంలోని దాసాంజనేయస్వామి ఆలయంలో హనుమత్ వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకుడు వీఎం కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

ముగిసిన తిరు నక్షత్ర పూజలు



సింహాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో ఈనెల 9 నుంచి జరుగుతున్న విశిష్టా ద్వైత మతవ్యాపకులు తిరుమంగై ఆళ్వార్ తిరు నక్షత్ర పూజలు శుక్రవారంతో ముగిసాయి. ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులు, ఆళ్వార్లతో వేదికపై అధిష్ఠింపజేశారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నాలాయిర దివ్య ప్రబంధంలోని పాశురాలను ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో ఆలయ అధ్యాపకులు పారాయణం చేశారు. తిరు నక్షత్ర పూజలు ముగింపు సందర్భంగా మధ్యాహ్నం రాజభోగ నివేదన సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నగరంలో కాలుష్యం తగ్గాల్సిందే..

... 5వ పేజీ తరువాయి

సూచించింది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నిషేధంపై దృష్టిపెట్టాలని ఆదేశించింది.

గోదావరి, వంశధార అనుసంధానంతో విశాఖకు ప్రయోజనం

గోదావరి, వంశధార నదుల అనుసంధానం జరిగితే ఉత్తరాంధ్రకు ఎంతో ప్రయోజనమని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితే విశాఖ నగరవాసులకు తాగునీటి సమస్య తీరుతుందని, అలాగే పారిశ్రామిక అవసరాలకు తగినంత వినియోగించుకోవచ్చునని అంచనా వేసింది. ఈ రెండు నదుల అనుసంధానం వల్ల వంశధార నది బేసిన్‌లో వర్షాలు తగ్గితే గోదావరి నుంచి నీటిని సరఫరా చేయవచ్చు. ఒకవేళ వంశధారలో నీటి లభ్యత ఎక్కువగా ఉంటే విశాఖకు గోదావరి నుంచి కాకుండా ఇటు నుంచి సరఫరా చేసుకోవచ్చు.

టీబీ, మాతా, శిశు మరణాలు అధికం

జిల్లాలో టీబీ నియంత్రణపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం సూచించింది. జిల్లాలో ప్రస్తుతం 3,879 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కొత్తగా నమోదవుతున్న కేసులు సంఖ్య కూడా అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన ఆవశ్యకతను జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం తెలియజేసింది. అలాగే మాతా, శిశు మరణాలు కూడా అధికంగా ఉన్నట్టు పేర్కొంది. దీనిపైనా దృష్టిసారించాల్సి ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 15,942 మంది జన్మించగా, వారిలో 233 మంది మృతిచెందారు. డెంగ్యూ కేసులు జిల్లాకు భారంగా ఉన్నట్టు కలెక్టర్ల సదస్సులో సీఎం పేర్కొన్నారు. గడిచిన ఏడాది 1252 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకూ 673 కేసులు నమోదయ్యాయి.

స్కిల్ హబ్స్‌లో శిక్షణ

విశాఖపట్నం జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 10 స్కిల్ హబ్స్ నిర్వహిస్తున్నారు. వీటిలో 755 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే 314 మంది శిక్షణ పూర్తి చేసుకోగా, మరో 234 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాదిలో 21 జాబ్‌మేళాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 22 నిర్వహించారు. 72 పరిశ్రమలు పాల్గొని 941 మందికి ఉద్యోగాలు కల్పించాయి.

వైసీపీ నేతపై 'మహా' ప్రేమ

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ అధికారులు ఏమీ పట్టనట్టు ఊరుకున్నారు. తన దందాను అధికారులు ప్రశ్నించకపోవడం, తమ పార్టీ అధికారంలో ఉండడంతో తాను ఏం చేసినా అడ్డుచెప్పేవారే లేరనే భావనతో ఆయన..అదే భవనంపై అదనపు అంతస్థు నిర్మించారు. దీనిపై అపార్టుమెంట్‌లోని మిగిలిన ఫ్లాట్ యజమానులు అభ్యంతరం చెప్పడంతో వారిని రౌడీలతో బెదిరించడం, వాహనాల టైర్లు కోసేయడం వంటివి చేయడంతో ఎవరికి వారు భయపడి మిన్నకుండిపోయారు. అపార్టుమెంట్‌లో ఉల్లంఘనలపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు మౌఖికంగా ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం స్పందించలేదని ఫ్లాట్ యజమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ నేత తీరుతో తమ వాహనాలను రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నామని వాపోతున్నారు. వైసీపీ నేతపై ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉందని చర్యలు తీసుకోలేమని చెప్పిన అధికారులు, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

'ఎల్‌ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి ఉద్యమిస్తాం'

డాబాగార్డెన్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సంక్షేమం కోసం ఉద్యమిస్తామని అఖిల భారత జీవిత బీమా సంస్థ ఏజెంట్ల సమాఖ్య (లీయాఫీ) ఛైర్మన్ ఎన్.గజపతిరావు ప్రకటించారు. ఏజెంట్ల సమస్యల పరిష్కారం కోసం లీయాఫీ సౌత్ సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం డాబాగార్డెన్స్ ఎల్‌ఐసీ బిల్డింగ్ వద్ద దర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెంట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత జీవిత బీమా సంస్థ యాజమాన్యంపై ఉందన్నారు.

☛ సంక్షిప్తంగా..

ఘనంగా హనుమద్వ్రతం



అలంకృతుడైన అంజనేయస్వామి

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని ఆరో సెక్టరులో ఉన్న వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం హనుమద్వ్రతం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తికి పంచామృత అభిషేకం నిర్వహించారు. హనుమద్ తోరణాలతో అలంకరించి, వ్రత కథాప్రవచనం చేశారు. అనంతరం తీర్థప్రసాద వితరణలో సమీప ప్రాంతాల నుంచి భక్తులు భారీగా పాల్గొన్నారు. వేంకటేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని తిరుమంగై ఆళ్వార్‌స్వామి వార్షిక తిరునక్షత్ర సందర్భంగా స్నపన తిరుమంజనం, అలంకరణ సేవాకాలం, శాత్తుముఱై, తనియన్లు పారాయణ అనంతరం తీర్థ ప్రసాద వితరణ జరిగినట్టు ఆలయ కమిటీ కార్యదర్శి ప్రసాదరావు తెలిపారు.

శతాధిక వృద్ధురాలు మృతి



అప్పయమ్మ

వెంకోజీపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాత వెంకోజీపాలెంలోని శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘానికి చెందిన పల్లా అప్పయమ్మ (105) శుక్రవారం మరణించారు. నాలుగు తరాల వారిని చూసిన వృద్ధురాలి మరణంతో గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతికి గ్రామస్థులు సంతాపాన్ని తెలియజేశారు.

14, 16 తేదీల్లో చినగదిలిలో రెవెన్యూ సదస్సులు

ఆరిలోవ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి రూరల్ మండల తహసీల్దార్ కార్యలయ పరిధిలో గల చినగదిలిలో ఈ నెల 14, 16 తేదీల్లో రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు.. ఈ క్రమంలో 14 తేదీన (శనివారం) ఆరిలోవ గ్రామ పరిధిలో గల 9, 10, 11 వార్డులకు సంబంధించి రవీంద్రనగర్ చివరి బస్టాపు సమీపంలో గల వేంకటేశ్వరా కల్యాణ మండపంలో సదస్సు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉదయం 9గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల సదస్సు నిర్వహిస్తామన్నారు. రెవెన్యూపరమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

అలాగే 16వ తేదీన 12, 13 వార్డులకు సంబంధించి ఆరిలోవ టీబీసీ పాయింట్ సమీపంలో గల యూనియన్ బ్యాంకు పక్కన గల హిందీ కాలేజీ రోడ్డులో సదస్సు నిర్వహించునున్నట్టు తెలిపారు. ఈ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 24, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	98
ఫారం ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

మొదలైన క్రిస్మస్ సందడి

» పలు చోట్ల అమ్మకాలు మొదలు » షాపుల వద్ద ఆకర్షణీయంగా స్టార్స్ లైటింగ్



ఆకట్టుకుంటున్న క్రిస్మస్ ట్రీలు



అమ్మకానికి సిద్ధం చేసిన క్రిస్మస్ స్టార్స్, బల్బులు

వెంకోజీపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రాంతాల్లో క్రిస్మస్ పండుగ సందడి మొదలైంది. క్రైస్తవ ప్రార్థనా మందిరాల వద్ద క్రీస్తు జననానికి గుర్తుగా క్రిస్మస్ అలంకరణ వస్తువుల విక్రయాలను ప్రారంభించారు. వెంకోజీపాలెం, హెచ్‌బీ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, ఇసుకతోట పరిసరా ప్రాంతాల్లోని రహదారుల పక్కన్న, దుకాణాలలోనూ క్రిస్మస్ స్టార్స్, ట్రీలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు శాంతాక్లాజ్ మాస్కులు, టోపీలను కూడా విక్రయానికి ఉంచారు. ఈ పరిసర ప్రాంతాల్లోని పలు చర్చిలు, ఇండ్లను రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. క్రిస్మస్ కానుకలు, స్టార్లు, గ్రీటింగ్ కార్డులు, శాంతాక్లాజ్ దుస్తులు, టోపీలు, క్రిస్మస్ ట్రీలు తదితర వాటిని దుకాణాలలోనూ పుట్‌పాత్‌లపైన పెట్టి విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేయడానికి క్రైస్తవులు బారులు తీరుతున్నారు. వస్త్ర దుకాణాల్లో కొనుగోలుదారులతో రద్దీ ఏర్పడింది. కొన్ని దుకాణాల వద్ద ఇప్పటికే క్రిస్మస్ స్టార్లు, లైటింగ్ ఏర్పాటు చేయడంతో సాయంత్రం అయ్యేసరికి ఆయా ప్రాంతాలు సందడిగా, ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.

సేంద్రీయ ఎరువుల పంటలతోనే ఆరోగ్యం

» మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్



ఆర్గానిక్ మేళాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ మాధవ్

మద్దిలపాలెం, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ సేంద్రియ ఎరువులతో పండించిన పంటలు ఆరోగ్యానికి దోహదం చేస్తాయని మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న ఆర్గానిక్ మేళాలో భాగంగా శుక్రవారం నిర్వహించిన 'మీ చేతిలో మీ ఆరోగ్యం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సహజసిద్ధమైన ఆయుర్వేదం, యోగా, ప్రకృతి వైద్యం, హోమియోపతి ఆయుష్ విభాగం ద్వారా ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరిలో ఒక వైద్యుడుంటారన్నారు. అల్లోపతి వైద్యం వచ్చి అన్ని రకాల వైద్యాలను చంపేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారతీయ వైద్యవిధానాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో భారత కిసాన్ జాతీయ కార్యదర్శి జలగం కుమార్‌స్వామి, రైతు సాధికారత సంస్థ రాష్ట్ర థీమెటిక్ నాయకుడు బి.ప్రభాకర్, ఆయుష్ ఆర్డీడీ ఝాన్సీరాణి, హోమియో వైద్యుడు రమేష్, యోగా గురువు పైడంనాయుడు, సిద్ధ వైద్యుడు జగదీష్, సుందరరాజ్, పెరుమాళ్, రజితా రోయ్, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు పండించిన వంకాయలు విక్రయం



గ్రేడింగ్ చేసి వంకాయలను అమ్మకానికి సిద్ధం చేస్తున్న ఓపెన్ జైలు ఖైదీలు

ఆరిలోవ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలోని ఓపెన్ జైలుఖైదీలు గల వంగ తోటలో పండించిన సుమారు 450 కిలోల వంకాయలను శుక్రవారం కోశారు. జైలు అధికారుల పర్యవేక్షణ వీటిని గ్రేడింగ్ చేశారు. కొన్ని జైలు అవసరాల కోసం వినియోగించేందుకు తరలించారు. మిగిలిన వంకాలను జైలు బయట ఉన్న సుధార్ క్యాంటీన్‌లో ఉంచి విక్రయానికి తరలించారు.

జైలులో వ్యవసాయ ఇన్‌చార్జ్ జైలర్ కుసుమకుమార్, డిప్యూటీ జైలర్ కనకరాజు ఆధ్వర్యంలో వంకాయల విక్రయాలు చేపట్టారు. రైతుబజార్ ధరలకే ఇక్కడ విక్రయాలు సాగించనున్నట్టు జైలు సూపరింటెండెంట్ మహేష్ తెలిపారు. ఈ వంకాయలు పూర్తి సేంద్రీయ ఎరువులతో పండించినవి చెప్పారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విక్రయాలు చేయనున్నట్టు తెలిపారు.

విమ్స్‌లో ఉచిత వైద్య సేవలు అందించాలి

» తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ప్రియాంక దండి



విమ్స్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రియాంక దండి, కాంగ్రెస్ నేతలు

ఆరిలోవ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ వైద్య విజ్ఞాన కేంద్రం (విమ్స్)లో పేదలందరికీ పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తూర్పు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ప్రియాంద దండి కోరారు. శుక్రవారం ఆమెతో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు విమ్స్ సూపరింటెండెంట్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. విమ్స్‌లో ఉచిత వైద్య సేవలు అందితే కేజీహెచ్‌పై భారం తగ్గుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో.. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విమ్స్ ఆస్పత్రి నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారని, ఆయన మరణానంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ వైద్యుల నియామకం, వైద్య పరికరాలను అందించిందన్నారు. అనంతరం వచ్చిన ప్రభుతాలు మాత్రం ఈ ఆస్పత్రిని నిర్లక్ష్యం చేశాయని ప్రియాంక విమర్శించారు. ఎంతో విశాలంగా ఉంటే ఈ ఆస్పత్రిని ధర్మాస్పత్రిగా మార్చాలని ఆమె డిమాండ్ చేశారు. విమ్స్ సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నేతలు చిన్నబాబు, మెహర్, శ్రీనివాస్, యువజన కాంగ్రెస్ నేతలు కోరిబల్లి సాయి, జోగేంద్ర, దేవర వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

దుర్గమ్మకు కానుకగా బంగారు మంగళ సూత్రాలు



దుర్గమ్మకు మంగళసూత్రాలు అందజేస్తున్న రాము దంపతులు

విజయవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ అలంకరణ నిమిత్తం 25 గ్రాముల బంగారు మంగళసూత్రాలను విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీకి చెందిన ఏవీ శ్రీనివాస్ దంపతులు అందజేశారు. శుక్రవారం ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసి, అధికారులకు ఈ కానుకను అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని అధికారులు అందజేశారు. వేద పండితులు ఆశీస్సులు అందించారు.

భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతం



హనుమంతుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వెంకోజీపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మార్గశిర శుద్ధ త్రయోదశి పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రతమ్‌ను నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ పూజలు నిర్వహించారు. ఆఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ మండపారాధన, పంపా పూజ, పంచామృత సహిత నారికేళ ఫలోదక అభిషేకాలు, సహస్రత నాగవళీదళ సహిత సింధూర పూజ, తోరగ్రంధి పూజ, నీరాజన మంత్ర పుష్పాలు, హనుమత్ కథ శ్రవణం, మహదాశీర్వచనం వంటివి నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఈ కార్యక్రమంలో శ్రీరామానంద ఆశ్రమం, దేవదాయశాఖ ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది రాంబాబు, రామాంజనేయులు, గ్రామ సేవా సంఘం అధ్యక్షులు పీల కనకరాజు, మాజీ అధ్యక్షుడు మద్దాల వీరవెంకట అప్పారావు, కాళ్ల శంకర్, బోర ధనరెడ్డి, ఎస్.నరసింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో భక్తుల రద్దీ



అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

జగదాంబ కూడలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు శుక్రవారం కూడా రద్దీగా కనిపించాయి. ఉచిత దర్శనాల క్యూలైన్లు భక్తులతో కిటికిటలాడాయి. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు.నిత్యపూజల్లో భాగంగా అర్చకులు క్షీరాభిషేకాని నిర్వహించారు. భక్తులకు శీఘ్రదర్శనాలు జరిగేలా ఈవో కె.శోభారాణి ఎప్పటికప్పుడు సూచనలిచ్చారు. ఆలయ పరిసరాల్లో మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యే చర్యలు తీసుకున్నారు. రీడింగ్ రూమ్ నుంచి విక్టోరియా ఆసుపత్రి రోడ్డు వరకు పరిశుభ్రంగా కనిపించాయి. గర్భ గుడి లోపల భక్తులు సమర్పించిన పూజా సామగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకోగలిగారు.అమ్మవారి గర్భగుడి లోపల నీటితో శుభ్రం చేయించడంతో భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. దర్శనం అనంతరం బయటకు వెళ్లే మార్గం పరిశుభ్రతతో, నేల పొడిగా ఉండేలా చూడడంతో భక్తులు అధికారులపై ప్రశంసలు కురిపించారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు లభ్యమయ్యేలా సిబ్బంది చూసుకున్నారు. మునుపెన్నడూ లేని విధంగా అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల సందర్భంగా ప్రశాంత దర్శనాలకు అవకాశం కలిగింది. ఆలయం వద్ద సాంస్కృతిక ప్రదర్శనలకు విశేష స్పందన కనిపించింది.

రైల్వేలో ఇంధన పొదుపుపై అవగాహన



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వాల్తేరు రైల్వే అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఈ నెల 8 నుంచి 14 వరకు జాతీయ ఇంధన పరిరక్షణ వారాన్ని పాటిస్తోంది. వివిధ మార్గాల్లో ఇంధన పొదుపుపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యం. డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ మార్గదర్శకత్వంలో డివిజన్ అంతటా రైల్వేస్టేషన్లు, ఇతర ప్రదేశాల్లో బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఇంధన పొదుపు నినాదాలతో కూడిన ర్యాలీలతో ప్రచారం నిర్వహించారు. వాల్తేరు డివిజన్‌లో అమలు చేసిన కొన్ని శక్తి సంరక్షణ పద్ధతులను ప్రదర్శించారు. దీనిలో భాగంగా డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ఇంధన పొదుపుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ మాట్లాడుతూ సౌర, పవన విద్యుత్ వంటి సహజ ఇంధన వనరులను ఉపయోగించుకునే వినూత్న పద్ధతులను అన్వేషించాలని అధికారులకు సూచించారు. తక్కువ ఖర్చుతో కూడుకున్న, శక్తిమంతమైన ప్రత్యామ్నాయంగా టైమర్‌లతో కూడిన ఎల్ఈడీ దీపాలు ఉపయోగించాలన్నారు. సౌర విద్యుత్ వినియోగం, హెడ్ ఆన్ జనరేషన్ (హెచ్ఓజీ) వినియోగం కారణంగా ఈ ఏడాది నవంబరు వరకు వాల్తేరు డివిజన్ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.60 లక్షలు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఇ.శాంతారాం, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎంఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పురుషుల వాలీబాల్ టోర్నీకి ఏయూ జట్టు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల పురుష వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 18 నుంచి కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే ఈ టోర్నీలో పి.కృష్ణప్రసాద్, కె.రవికిరణ్, కె.సాయివర్మ, ఎస్.అప్పలనాయుడు, వి.రమేష్, దాసరి ప్రసాద్, సీహెచ్ గోవర్ధన్, ఎన్.కిషోర్, కె.విజయ్‌కుమార్, ఎం.శివప్రసాద్, కె.నాగరాజు, అంపల్లి గుంపశెట్టి, టి.మహేష్ ప్రాతినిధ్యం వహించనుండగా జట్టు కోచ్‌గా శివాజీరాజు వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, హెచ్‌వోడీ డాక్టర్ ఎ.పల్లవి, జట్టు సభ్యులను అభినందించి పతక సాధన ద్వారా ఆలిండియా వర్సిటీకి అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంపు హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నేత ఆనందరావు

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధి నీటిసరఫరా విభాగంలో టెక్నికల్ విధులు నిర్వహిస్తున్న అన్‌స్కిల్డ్ కేటగిరీలోని అవుట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలను పెంచుతూ కౌన్సిల్ తీర్మానం చేయడంపై జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.ఆనందరావు హర్షం వ్యక్తంచేశారు. యూనియన్ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వేతనాలు రూ.6 వేల వరకూ పెరుగుతాయన్నారు. మిగిలిన విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని కోరారు. వేతనాల పెంపునకు చొరవ తీసుకున్న ఎంపీ ఎం.శ్రీభరత్, ఎమ్మెల్యేలు, అన్నిపార్టీల ఫ్లోర్‌లీడర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్.సత్యం, శ్రీను, ఎల్లాజీ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, పాల్గొన్న కార్పొరేటర్ రోహిణి తదితరులు

ఆరిలోవ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డు పరిధిలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శుక్రవారం శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ అక్కరమాని రోహిణీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.13 లక్షల జీవీఎంసీ నిధులతో అపోలో ఆస్పత్రికి సమీపంలో రజకులకు సామాజిక భవనం, పెదగదిలి కొండవాలులో రూ.28 లక్షలతో రక్షణ గోడ, సాలిపేటలో కొండవాలు ప్రాంతంలో రూ.19 లక్షలతో రిటైనింగ్ వాల్, నిర్మించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి పోలారావు, నేతలు ఏడువాక సన్యాసిరావు, ఆంజనేయ రజకుల సంఘ అధ్యక్షుడు ఎల్.అప్పారావు, ఏఈ వెంకటరావు పాల్గొన్నారు.

15వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వాలను నమోదు చేస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, టీడీపీ నేతలు

వెంకోజీపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15 వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, అప్పారి గిరిబాబు ఇతర టీడీపీ నాయకులు పాల్గొని పార్టీ సభ్యత్వాన్ని నమోదు చేశారు. రూ.100లతో సభ్యత్వం పొందిన వారికి బీమా సౌకర్యం ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్రోతు చిన్నారావు, బోని సూరిబాబు, యెన్ని సత్యం, చాపన రాము, పోలెం నరేంద్ర, కర్రి గౌరీ, లలిత కెల్ల హరి, బీశెట్టి జగదీష్, నరాల సత్తిబాబు, చాణక్య, సంపంగి సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అపార్ ఐడీ కోసం విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ పరీక్షలు



చిన్నారులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెంకోజీపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అపార్ గుర్తింపు కార్డులో నమోదు కోసం 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రెడ్ క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు ఉచిత బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది, రెడ్ క్రాస్ జిల్లా కో-ఆర్డినేటర్ సంతోష్, సిబ్బంది పాల్గొని రక్త పరీక్షలు చేశారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ఆరిలోవ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలో ఈ నెల 28, 29 జరగనున్న సీపీఎం మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి కృష్ణారావు కోరారు. శుక్రవారం సీపీఎం స్థానిక కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం ఎప్పుడూ ప్రజల కోసమే పోరాడుతుందన్నారు. ఆరిలోవ ప్రాంతంలోని ముడసర్లోవ భూముల కుంభకోణాన్ని నిరసిస్తూ నగర వ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు చేపట్టినట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, పన్నులు వేసి పీడించే సమయంలో ప్రజల పక్షాన పోరాటం జరిపేది సీపీఎం అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు తిరగక ముందే విద్యుత్ చార్జీల పేరిట రూ.17 వేల కోట్ల భారం ప్రజలపై వేశారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అస్తవ్యస్త పనితీరును నిరసిస్తూ ఈ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నరేంద్రకుమార్, జోన్ కమిటీ సభ్యులు పి.శంకర్, డి.నాగరాజు, నాయుడు, కాంతం, తదితరులు పాల్గొన్నారు.

బయోడైవర్సిటీ పార్కును సందర్శించిన విద్యార్థులు



బయోడైవర్సిటీ పార్కులో మొక్కలను పరిశీలిస్తున్న విద్యార్థులు

పెదవాల్తేరు, డిసెంబరు 13 : జీవ వైవిధ్యం, పర్యావరణ అధ్యయన యాత్రలో భాగంగా నగరంలోని పెదవాల్తేరు రాణిచంద్రమణి దేవి ఆస్పత్రి ఆవరణలో గల బయోడైవర్సిటీ పార్కును శుక్రవారం ఉషోదయ కళాశాల విద్యార్థులు కళాశాల అకడమిక్ డీన్ వాసు ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా బయో డైవర్సిటీ పార్కును సందర్శించి పలు అరుదైన మొక్కల కోసం వివరించారు. సెల్ఫ్ ఎక్స్‌ప్లనేటరీ బోర్డులతో అధ్యయనం చేస్తున్న వందలాది ఔషధ మొక్కలను చూసి పులకించిపోయారు.

నేటి నుంచి ఇంధన పొదుపు వారోత్సవాలు

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించనున్నట్టు అధికారులు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ శ్యాంబాబు మాట్లాడుతూ ఈనెల 20న అన్ని మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో విద్యుత్ పొదుపుపై అవగాహనా ర్యాలీలు, పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇందన సంరక్షణ పద్ధతులు, స్టార్‌రేటింగ్ గృహోపకరణాల వినియోగంపై వివరిస్తామన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల్లో వర్క్‌షాప్స్ నిర్వహిస్తామన్నారు.

డీఈవో పాఠశాలల తనిఖీ



పదో తరగతి విద్యార్థిని ప్రశ్నిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమకుమార్

సీతమ్మధార, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార పి అండ్ టి కాలనీలోని ఎస్ఎం సిహెచ్ పాఠశాల, సీతంపేట మధురానగర్‌లోని జీవీఎంసీ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో బోధన ఎలా ఉందో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం అకస్మిక తనిఖీల్లో పరిశీలించారు. పదోతరగతి విద్యార్థులతో ముచ్చటించి విషయ పరిజ్ఞానాన్ని అంచనా వేశారు. ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని, ఏవైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు. చదువు అవశ్యకతను తెలియజేస్తూ క్రమశిక్షణ నైతిక విలువలతో విద్యార్థులు మెలగాలని హితవు పలికారు. కౌశల్ క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన తొమ్మిదో తరగతి విద్యార్థి పి.చరణ్‌కుమార్‌ను డీఈఓ అభినందించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'టెంట్ తొలగింపు దుర్మార్గం'



పోర్టు ఆసుపత్రి ఎదుట తొలగించిన టెంట్ కింద నిరసన తెలుపుతున్న నాయకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పోర్టు ఆసుపత్రి ఎదుట టెంట్‌ను పోలీసులు తొలగించడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ మండిపడ్డారు. ఆసుపత్రి ఎదుట శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ పోర్టు ఆసుపత్రి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆసుపత్రి దగ్గర టెంట్ వేసుకుని 74వ రోజు శాంతియుతంగా నిరసన దీక్ష చేస్తున్నామన్నారు. ఉదయాన్నే పోలీసులు అక్రమంగా టెంట్‌ను తొలగించడం దుర్మార్గమన్నారు. శాతియుత నిరసనలను భగ్నం చేయాలని చూడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ నిరవధిక నిరసన కారణంగా టెండర్ దాఖలు చేసేందుకు ఎవరూ రాకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై పోలీసుల ద్వారా ప్రతాపం చూపిస్తున్నారన్నారు. 40 వేల మంది ఆరోగ్యాలకు సంబంధించి నిరసన తెలియజేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం భగ్నం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, నాయుడు, రాఘవులు, పైడిరాజు, శంకరరావు, నర్సింగరావు, శ్రీను, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

కంచరపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి అధిక సంఖ్యలో వినతులు అందుతున్నాయి. జీవీఎంసీ 49వ వార్డు బర్మాక్యాంప్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుతో పాటు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి గజపతి నగర్, నలందనగర్‌లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. దశాబ్దాలుగా నివసిస్తున్న తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎమ్మార్వోకు వినతిపత్రాలు అందజేశారు.

స్వర్ణాంధ్ర వేడుకల్లో జిల్లా అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్‌ను మార్చబోయే స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ వేడుకలలో జిల్లా నుంచి వివిధ శాఖల అధికారులు భాగస్వాములయ్యారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశమందిరంలో ప్రత్యక్షప్రసారం చేశారు. ఇందులో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్ ఎస్‌డీసీ శేష శైలజ, డీపీవో శ్రీనివాసరావు, అధికారులు భాస్కరరావు, మాధవి, జ్యోతి సూర్యారావు పాల్గొన్నారు.

ఘనంగా వ్యవస్థాపక దినోత్సవం



కేంద్రీయ విద్యాలయంలో పాల్గొన్న అతిథులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని ప్రముఖ విద్యాసంస్థ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ 62వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ ఏవీఎల్ జగన్నాథరావు హాజరై ప్రారంభించారు. కేంద్రీయ విద్యాలయంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులు, వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమ మధురస్మృతులను నెమరు వేసుకున్నారు. విద్యారంగంలో కేవీఎస్ అందిస్తున్న సేవలపై విద్యార్థులు ప్రదర్శించిన పాటలు, నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కమల్‌జిత్, హెచ్.ఎం. వి.శైలజ, సత్యనారాయణ, ఇందిరా నాయర్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కనక మహాలక్ష్మి దర్శనానికి పోటెత్తిన భక్తులు





అమ్మవారి దర్శనానికి శుక్రవారం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు, కనక మహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

జగదాంబ కూడలి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కనక మహాలక్ష్మి దర్శనానికి వచ్చిన భక్తులతో క్యూలైన్లు శుక్రవారం కూడా రద్దీగా కనిపించాయి. ఉచిత దర్శనాల క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. నిత్యపూజల్లో భాగంగా అర్చకులు క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. భక్తులకు శీఘ్రదర్శనాలు జరిగేలా ఈవో కె.శోభారాణి ఎప్పటికప్పుడు సూచనలిచ్చారు. ఆలయ పరిసరాల్లో మెరుగైన పారిశుధ్యం కోసం ప్రత్యే చర్యలు తీసుకున్నారు. రీడింగ్ రూమ్ నుంచి విక్టోరియా ఆసుపత్రి రోడ్డు వరకు పరిశుభ్రంగా కనిపించాయి. గర్భ గుడి లోపల భక్తులు సమర్పించిన పూజా సామగ్రిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతో ఇబ్బందులు లేకుండా దర్శనం చేసుకోగలిగారు. అమ్మవారి గర్భగుడి లోపల నీటితో శుభ్రం చేయించడంతో భక్తులు సంతోషం వ్యక్తంచేశారు. దర్శనం అనంతరం బయటకు వెళ్లే మార్గం పరిశుభ్రతతో, నేల పొడిగా ఉండేలా చూడడంతో భక్తులు అధికారులపై ప్రశంసలు కురిపించారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు లభ్యమయ్యేలా సిబ్బంది చూసుకున్నారు. మునుపెన్నడూ లేని విధంగా మార్గశిర మాసోత్సవాల సందర్భంగా ప్రశాంత దర్శనాలకు అవకాశం కలిగింది. సాంస్కృతిక ప్రదర్శనలకు విశేష స్పందన కనిపించింది.

ఇంధన పొదుపుపై అవగాహన



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వాల్తేరు రైల్వే అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్, ఈస్ట్ కోస్ట్ రైల్వే ఈ నెల 8 నుంచి 14 వరకు జాతీయ ఇంధన పరిరక్షణ వారాన్ని పాటిస్తోంది. వివిధ మార్గాల్లో ఇంధన పొదుపుపై అవగాహన పెంచడం ఈ కార్యక్రమం లక్ష్యం. డివిజనల్ రైల్వే మేనేజర్ మనోజ్‌కుమార్ సాహూ మార్గదర్శకత్వంలో డివిజన్ అంతటా రైల్వేస్టేషన్లు, ఇతర ప్రదేశాల్లో బ్యానర్లు, పోస్టర్లు, స్టిక్కర్లు, ఇందన పొదుపు నినాదాలతో కూడిన ర్యాలీలతో ప్రచారం నిర్వహించారు. వాల్తేరు డివిజన్‌లో అమలు చేసిన కొన్ని శక్తి సంరక్షణ పద్ధతులను ప్రదర్శించారు. దీనిలో భాగంగా డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం ఇందన పొదుపుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ మాట్లాడుతూ సౌర, పవన విద్యుత్ వంటి సహజ ఇందన వనరులను ఉపయోగించుకునే వినూత్న పద్ధతులను అన్వేషించాలని అధికారులకు సూచించారు. తక్కువ ఖర్చుతో కూడుకున్న, శక్తిమంతమైన ప్రత్యామ్నాయంగా టైమర్‌లతో కూడిన ఎల్ఈడీ దీపాలు ఉపయోగించాలన్నారు. సౌర విద్యుత్ వినియోగం, హెడ్ ఆన్ జనరేషన్ (హెచ్ఓజీ) వినియోగం కారణంగా ఈ ఏడాది నవంబరు వరకు వాల్తేరు డివిజన్ ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.60 లక్షలు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఇ.శాంతారాం, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఎంఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సచివాలయ కార్యదర్శుల ఆత్మగౌరవాన్ని కాపాడాలి'

మహారాణిపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ వార్డు సచివాలయ కార్యదర్శుల ఆత్మగౌరవం కాపాడాలని పరిపాలనా కార్యదర్శుల సమాఖ్య డిమాండ్ చేసింది. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి తమపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ శుక్రవారం సచివాలయ కార్యదర్శుల సంఘం నాయకులు దక్షిణ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గౌరవ స్థానంలో ఉన్న కార్పొరేటర్ నిజాలు తెలుసుకోకుండా చేసిన వ్యాఖ్యల వల్ల తమ మనోభావాలు దెబ్బతిన్నాయని, ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. వాటిని ఉపసంహరించుకోవాలని సలహా ఇచ్చారు. సంఘం నాయకులు పల్లా కిరణ్‌కుమార్, చింతకాయల బంగారురాజు, పీజే గణేష కుమార్, రమణ, అశోక్‌కుమార్, సాయికృష్ణ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హనుమద్ వ్రతం



పూర్ణామార్కెట్ వద్ద పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు



అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలో..

పూర్ణామార్కెట్/అక్కయ్యపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమద్ వ్రతం సందర్భంగా శుక్రవారం అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పంచామృతాభిషేకం, నామార్చన, సింధూరార్చనలు జరిపారు. పూర్ణామార్కెట్‌లో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, దేవస్థానం ఏసీ అన్నపూర్ణ, ఈవో జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. అక్కయ్యపాలెం ప్రధాన రహదారిలోని వేణుగోపాలస్వామి ఆలయంలోని అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు పీసపాటి మురళీ కృష్ణమాచార్యుల సమక్షంలో ఆంజనేయస్వామికి తెల్లవారు జాము నుంచే భక్తులు వైష్ణవ సంప్రదాయంలో పూజలు, తమలపాకులు, సింధూర అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

గ్రీన్‌బెల్ట్ ఆక్రమణల తొలగింపు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తదితరులు

కంచరపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఎఎస్ఎన్ మెగా మాల్ సంస్థ గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించడంలో ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఆక్రమణపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. గ్రీన్‌బెల్ట్‌లో నిర్మించిన రోడ్డు, డివైడర్లను తొలగించారు. ఈ ప్రదేశాన్ని విష్ణుకుమార్ రాజు పరిశీలించారు. గ్రీన్ బెల్ట్‌లో ఆక్రమణలను సహించేది లేదని తెలిపారు. కార్యక్రమంలో ఐదో జోన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, ఉత్తర జనసేన నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, టీడీపీ నాయకులు కుట్టా కార్తీక్, సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు పేర్కొన్నారు. 49వ వార్డు బర్మాక్యాంప్ ఏఎస్సార్ నగర్-2 సచివాలయం ఆవరణలో శుక్రవారం చేపట్టిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి పార్టీలు కలసి పనిచేస్తున్నాయని అన్నారు. గత పాలకుల అవినీతి నిర్వాకాల్ని నేరుగా ప్రజల నుంచి తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం గోపాలపట్నం తహసీల్దారు పి.వి.రమేష్, జీవీఎంసీ జోన్-5 జెడ్సీ, అధికారులతో కలసి ఉత్తర నియోజకవర్గ వాసుల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. ప్రాధమ్యాల వారీగా వాటి పరిష్కార బాధ్యతలను అధికారులకు అప్పగించారు.

'ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి'



సమావేశంలో మాట్లాడుతున్న బీఎస్పీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.పూర్ణచంద్రరావు తదితరులు

సీతంపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని పక్కన పెట్టి డీప్ టెక్ అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడటం హాస్యాస్పదమని బీఎస్పీ ఏపీ కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.పూర్ణచంద్రరావు అభ్యంతరం తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు కూడా ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించారని ఆక్షేపించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపివేయించాలని డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన బహిరంగ లేఖను ఆయన విడుదల చేశారు. ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అప్పులు, ఉద్యోగుల సమస్యగా చిత్రీకరించడాన్ని తప్పు పట్టారు. బీఎస్పీ జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసిందని చెబుతూ పలు అంశాలను ప్రస్తావించారు. ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణను బీఎస్పీ చూస్తూ ఊరుకోదని అన్నారు. ప్లాంట్‌ను అమ్మేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. విశాఖ ఉక్కు కోసం పలువురు చేసిన త్యాగాలు వృథా కాకూడదని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఇతర నాయకులు డిమాండ్ చేశారు. తాము నిర్వాసితులతో దీక్ష చేసినప్పుడు హామీ ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు నేడు ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో ఐఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, బీఎస్పీ నాయకుడు శివప్రసాద్, ఉద్యమ నాయకులు అయోధ్య రామయ్య తాతారావు, సత్యం, లక్ష్మి, తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన పెంచుకుంటే మేధో వికాసం



విద్యార్థుల ప్రాజెక్టు నమూనాలు తిలకిస్తున్న షీలా థామస్

డాబాగార్డెన్స్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే వివిధ అంశాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా మేధస్సు, సృజనాత్మకత బయటపడే అవకాశం ఉంటుందని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ రిటైర్డ్ ఫ్యాకల్టీ మెంబర్ షీలా థామస్ పేర్కొన్నారు. శుక్రవారం బేతాని స్కూల్‌లో 'ద క్రియేటివ్ టాలెంట్ ఇన్ స్టూడెంట్' అనే అంశంపై విద్యార్థినీ విద్యార్థులు ఎగ్జిబిషన్ నిర్వహించారు. దీన్ని ఆమె ప్రారంభించిన అనంతరం ప్రదర్శనలో విద్యార్థుల నమూనాలను పరిశీలించి, వాటి విశేషాలు తెలుసుకున్నారు. బేతాని స్కూల్ కరస్పాండెంట్ ఎ.ఐడనీఎం డ్ మాట్లాడుతూ శనివారం కూడా ప్రాజెక్టుల నమూనా ప్రదర్శన కొనసాగుతుందన్నారు. విద్యార్థుల మేధస్సు బయటపెట్టడం ద్వారా వారిలో ప్రతిభను గుర్తించేందుకు వీలవుతుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూ ఖ్యాతిని పెంచండి



ఖోఖో చాంపియన్‌షిప్ టోర్నీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య ఎన్.విజయ్ మోహన్, డాక్టర్ ఎ.పల్లవి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం మహిళల ఖోఖో చాంపియన్‌షిప్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. ఏయూ స్పోర్ట్సు ఎరీనాలో జరుగుతున్న ఈ పోటీలకు ఏయూ స్పోర్ట్సు బోర్డు కార్యదర్శి, వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడగా గుర్తింపు పొందిన ఖోఖోకు విశేష ఆదరణ ఉందని పేర్కొన్నారు. విద్యార్థినులు క్రమశిక్షణ, చిత్తశుద్ధితో ఆడి జాతీయ టోర్నీలో ఏయూ ఖ్యాతిని పెంచాలని ఆకాంక్షించారు. ఈ టోర్నీలో ఏయూ గుర్తింపు పొందిన ఎంఏఎల్ కాలేజీ (అనకాపల్లి), ఎంఆర్ కాలేజీ (విజయనగరం), జీడీసీ నక్కపల్లి, ఎస్వీఎల్ఎన్ఎస్ భీమిలి, వీఎంసీ కాలేజీ, డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజీ, వీజీడీసీ మహిళా కాలేజీ, సెయింట్ ఆన్స్ కాలేజీ, ప్రగతి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ తదితర జట్లు పాల్గొంటున్నాయని ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం విభాగాధిపతి డాక్టర్ ఎ.పల్లవి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల, బుల్లయ్య కాలేజీ ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ బీఆర్ఎస్ లక్ష్మణరెడ్డి, డాక్టర్ కిరణ్మయి, దుర్గారావు, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పురుషుల వాలీబాల్ టోర్నీకి ఏయూ జట్టు



ఎంపికైన జట్టు సభ్యులతో క్రీడారంగ ప్రముఖులు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టును శుక్రవారం ప్రకటించారు. ఈ నెల 18 నుంచి కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే ఈ టోర్నీలో పి.కృష్ణప్రసాద్, కె.రవికిరణ్, కె.సాయివర్మ, ఎస్.అప్పలనాయుడు, వి.రమేష్, దాసరి ప్రసాద్, సీహెచ్ గోవర్ధన్, ఎన్.కిషోర్, కె.విజయ్‌కుమార్, ఎం.శివప్రసాద్, కె.నాగరాజు, అంపల్లి గుంపశెట్టి, టి.మహేష్ ప్రాతినిధ్యం వహించనుండగా జట్టు కోచ్‌గా శివాజీరాజు వ్యవహరించనున్నారు. ఏయూ వ్యాయామ విద్య క్రీడాశాస్త్రం సంచాలకుడు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, హెచ్‌వోడీ డాక్టర్ ఎ.పల్లవి, జట్టు సభ్యులను అభినందించి పతక సాధన ద్వారా ఆలిండియా వర్సిటీకి అర్హత సాధించాలని ఆకాంక్షించారు.

రైళ్లు ఫుల్

... 5వ పేజీ తరువాయి

రైళ్లతోపాటు విశాఖ-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22801), హౌరా-కన్యాకుమారి (12665), భువనేశ్వర్-పాండిచ్చేరి (12898), భువనేశ్వర్-చెన్నై సూపర్‌ఫాస్ట్ (12830), టాటా-ఎర్నాకులం (18189), షాలిమార్-చెన్నై ఎక్స్‌ప్రెస్ (22825) రైళ్లకు జనవరి 22వ తేదీ వరకు బెర్తులు లభించే పరిస్థితి లేదు. విశాఖ మీదుగా చెన్నై వెళ్లే మెయిల్, కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనవరి 13వ తేదీన కొన్ని బెర్తులు అందుబాటులో ఉన్నాయి.

జనవరి 17 నుంచి 21 వరకూ సికింద్రాబాద్ ఫుల్

సికింద్రాబాద్ వెళ్లే గోదావరి (12727), విశాఖ (17015), గరీబ్‌రథ్ (12739), ఫలక్‌నూమా (12703), జన్మభూమి (12805), ఈస్ట్‌కోస్ట్ (18045), దురంతో (22203), ఎల్‌టీటీ (18519), వందేభారత్ (20833), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861) వంటి రెగ్యులర్ రైళ్లతోపాటు సంబల్‌పూర్-నాందేడు (20809), విశాఖ-నాందేడ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో బెర్తులు జనవరి 21 వరకూ రిజర్వు అయిపోయాయి.

హౌరా రైళ్లకు డిమాండ్

విశాఖ మీదుగా ప్రతిరోజు నడిచే సికింద్రాబాద్-హౌరా ఫలక్‌నూమా (12704), చెన్నై-హౌరా కోరమండల్ (12842), చెన్నై-హౌరా మెయిల్ (12840), హైదరాబాద్-షాలిమార్ ఈస్ట్‌కోస్ట్ (18046), బెంగళూరు-హౌరా (12864) రైళ్లతోపాటు వారానికి ఒకరోజు, రెండు రోజులు అందుబాటులో ఉండే విశాఖ-షాలిమార్ (22854), వాస్కోడిగమ-షాలిమార్ (18048), తిరుచరాపల్లి-హౌరా (12664), చెన్నై-సంత్రాగచ్చి (22808), పాండిచ్చేరి-హౌరా (12868), చెన్నై-షాలిమార్ (22826), బెంగళూరు-గుహవటి (12509), బెంగళూరు-హౌరా (22864), బెంగళూరు-హౌరా (22888), త్రివేంద్రం-షాలిమార్ (22641), సికింద్రాబాద్-షాలిమార్ (22850), బెంగళూరు-హౌరా దురంతో (12246), కన్యాకుమారి-హౌరా (12666), తిరుపతి-హౌరా హంసఫర్ (20890), మైసూర్ జంక్షన్-హౌరా 22818), మంగుళూరు-సంత్రాగచ్చి వివేక్ ఎక్స్‌ప్రెస్ (22852), నాగర్‌కోయిల్-షాలిమార్ గురుదేవ్ ఎక్స్‌ప్రెస్ (12659), తిరుపతి-సంత్రాగచ్చి ఎక్స్‌ప్రెస్ (22856) రైళ్లలో థర్డ్ ఏసీ, స్లీపర్ బెర్తులు అయిపోగా, ఫస్ట్, సెకండ్ ఏసీ కోచ్‌లలో అందుబాబులో ఉన్నాయి. విశాఖ-షాలిమార్ మధ్య మంగళవారం నడిచే ప్రత్యేక రైలులో (08508) బెర్తులు అందుబాటులో ఉన్నాయి. కొన్ని రైళ్లకు సంక్రాంతి తర్వాత రోజుల్లో ఏసీ కోచ్‌లలో బెర్తులు లభించే పరిస్థితి ఉంది.

కాలుష్యం తగ్గాల్సిందే

... 5వ పేజీ తరువాయి

సూచించింది. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై నిషేదంపై దృష్టిపెట్టాలని ఆదేశించింది.

గోదావరి, వంశధార అనుసంధానంతో విశాఖకు ప్రయోజనం

గోదావరి, వంశధార నదుల అనుసంధానం జరిగితే ఉత్తరాంధ్రకు ఎంతో ప్రయోజనమని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తయితే విశాఖ నగరవాసులకు తాగునీటి సమస్య తీరుతుందని, అలాగే పారిశ్రామిక అవసరాలకు తగినంత వినియోగించుకోవచ్చునని అంచనా వేసింది. ఈ రెండు నదుల అనుసంధానం వల్ల వంశధార నది బేసిన్‌లో వర్షాలు తగ్గితే గోదావరి నుంచి నీటిని సరఫరా చేయవచ్చు. ఒకవేళ వంశధారలో నీటి లభ్యత ఎక్కువగా ఉంటే విశాఖకు గోదావరి నుంచి కాకుండా ఇటు నుంచి సరఫరా చేసుకోవచ్చు.

టీబీ, మాతా, శిశు మరణాలు అధికం

జిల్లాలో టీబీ నియంత్రణపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం సూచించింది. జిల్లాలో ప్రస్తుతం 3,879 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కొత్తగా నమోదవుతున్న కేసులు సంఖ్య కూడా అధికంగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రత్యేకంగా దృష్టిసారించాల్సిన ఆవశ్యకతను జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం తెలియజేసింది. అలాగే మాతా, శిశు మరణాలు కూడా అధికంగా ఉన్నట్టు పేర్కొంది. దీనిపైనా దృష్టిసారించాల్సి ఉంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 15,942 మంది జన్మించగా, వారిలో 233 మంది మృతిచెందారు. డెంగ్యూ కేసులు జిల్లాకు భారంగా ఉన్నట్టు కలెక్టర్ల సదస్సులో సీఎం పేర్కొన్నారు. గడిచిన ఏడాది 1252 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకూ 673 కేసులు నమోదయ్యాయి.

స్కిల్ హబ్స్‌లో శిక్షణ

విశాఖపట్నం జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో 10 స్కిల్ హబ్స్ నిర్వహిస్తున్నారు. వీటిలో 755 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. ఇప్పటికే 314 మంది శిక్షణ పూర్తి చేసుకోగా, మరో 234 మంది శిక్షణ పొందుతున్నారు. ఈ ఏడాదిలో 21 జాబ్‌మేళాలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు 22 నిర్వహించారు. ఇందులో 72 పరిశ్రమలు పాల్గొని 941 మందికి ఉద్యోగాలు కల్పించాయి.

ఆయుష్ హబ్‌గా విశాఖ

... 5వ పేజీ తరువాయి

సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. విశాఖను ఆయుష్ హబ్‌గా మార్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక ప్రాజెక్టులను కేటాయిస్తున్నాయన్నారు. విమ్స్‌లో నేచురోపతి మెడికల్ కాలేజీ ఏర్పాటవుతోందన్నారు. భవన నిర్మాణఙ దాదాపు పూర్తయ్యిందన్నారు. అదే ప్రాంగణంలో 50 పడకలతో ఆయుష్ ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనివల్ల ఇన్‌పేషెంట్లును చేర్చుకుని సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా శొంఠ్యాంలో సుమారు ఏడు కోట్ల రూపాయలు వ్యయంతో ఆయుర్వేద ఫార్మసీ, డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటుచేస్తున్నట్టు తెలిపారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం జిల్లాలోని 23 డిస్పెన్సరీల అభివృద్ధికి మూడు లక్షలు రూపాయల చొప్పున నిధులను మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఆరు జిల్లాల్లోని డిస్పెన్సరీల్లో పలు కేడర్లలో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీచేయడం వల్ల మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ ఖాళీలకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

వైసీపీ నేతపై మహా ప్రేమ

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ అధికారులు ఏమీ పట్టనట్టు ఊరుకున్నారు. తన దందాను అధికారులు ప్రశ్నించకపోవడం, తమ పార్టీ అధికారంలో ఉండడంతో తాను ఏం చేసినా అడ్డుచెప్పేవారే లేరనే భావనతో ఆయన...అదే భవనంపై అదనపు అంతస్థు నిర్మించారు. దీనిపై అపార్టుమెంట్‌లోని మిగిలిన ఫ్లాట్ యజమానులు అభ్యంతరం చెప్పడంతో వారిని రౌడీలతో బెదిరించడం, వాహనాల టైర్లు కోసేయడం వంటివి చేయడంతో ఎవరికి వారు భయపడి మిన్నకుండిపోయారు. అపార్టుమెంట్‌లో ఉల్లంఘనలపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు మౌఖికంగా ఫిర్యాదు చేసినప్పటికీ కనీసం స్పందించలేదని ఫ్లాట్ యజమానులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ నేత తీరుతో తమ వాహనాలను రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నామని వాపోతున్నారు. వైసీపీ నేతపై ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైసీపీ అధికారంలో ఉందని చర్యలు తీసుకోలేమని చెప్పిన అధికారులు, ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

76.1 శాతం ఇళ్లకు కొళాయిల ద్వారా నీరు

... 5వ పేజీ తరువాయి

కాలువల నిర్వహణ రాష్ట్రస్థాయిలో 42.7 శాతం ఉంటే, జీవీఎంసీ పరిధిలో 44.6 శాతం ఉందని అధికారులు ప్రజెంటేషన్‌లో వివరించారు. వీధి దీపాలు రాష్ట్రస్థాయిలో 91.4 శాతం లైట్లు వెలుగుతుంటే, జీవీఎంసీ పరిధిలో 95 శాతం వెలుగుతున్నట్టు వివరించారు. జీవీఎంసీ పరిధిలో రోడ్లపై 2,783 చోట్ల మరమ్మతు పనులు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకూ 2,242 పనులు పూర్తిచేసినట్టు, మిగిలిన 541 పనులు వివిధ దశల్లో ఉన్నట్టు చూపించారు. పైలట్ ప్రాజెక్టు కింద విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌తోపాటు జీవీఎంసీ పరిధిలోని 642 కిలోమీటర్ల రోడ్ల నిర్వహణను గ్లోబల్ టెండర్ల ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తున్నట్టు అధికారులు వివరించారు.

పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులు

... 5వ పేజీ తరువాయి

తొలి సమావేశం, 23న మరో సమావేశం నిర్వహించి విలువలు ఖరారు చేయాలన్నారు.

భూముల రీసర్వే ఫిర్యాదులపై దృష్టి

ఇటీవల గ్రామాల్లో భూములను రీ సర్వే చేశారని, అయితే వాటిపై ఫిర్యాదులు పెద్దఎత్తున వస్తున్నందున వాటిని పరిష్కరించాలని సీఎం సూచించారు. విశాఖ జిల్లాకు సంబంధించి ఇప్పటివరకూ 51 గ్రామాల్లో సభలు నిర్వహించగా 3,195 ఫిర్యాదులు వచ్చాయని, అందులో 330 పరిష్కరించగా, ఇంకా 2,885 పెండింగ్‌లో ఉన్నట్టు చెప్పారు. వాటిని 31 మార్చి నాటికి క్లియర్ చేయాలని సీఎం సూచించారు.

కార్పొరేటర్ జగన్ క్షేత్ర పర్యటన



గెడ్డలను పరిశీలిస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87 వార్డు శ్రీగణేష్ నగర్, పాత వడ్లపూడిలో కార్పొరేటర్ బొండా జగన్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానికులు గెడ్డల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలు, కుక్కలు.. పందులతో ఇబ్బందులు, వీధిలైట్లు వెలగకపోవడం వంటి సమస్యలను ఏకరువు పెట్టారు. దీనిపై స్పందించిన జగన్ ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి

అగనంపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి షిర్డీసాయి ఆలయంలో సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం దత్త జయంతి ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు సేవా సమితి అధ్యక్షుడు కొయ్య వెంకటరమణారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులంతా ఉత్సవంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

స.హ. చట్టం అంటే అధికారుల బేఖాతర్

చట్టం ఉద్యమకర్త రామ అప్పారావు

అగనంపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కుచట్టంలో దరఖాస్తులను అధికారులకు లెక్కచేయడం లేదని ఆ చట్టం ఉద్యమ కర్త పట్టా రామఅప్పారావు ఆరోపించారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి అగనంపూడి వద్ద శివాలయం స్థలం గురించి రెండు నెలల క్రితం ఉక్కు భూసేకరణ కార్యాలయంలో దరఖాస్తు చేసినప్పటికీ నేటికి పట్టించుకోకపోవడం దారుణమని మండి పడ్డారు. శివాలయం నిర్మాణం నిమిత్తం ఎంత స్థలం, ఎప్పుడు కేటాయించారో తెలియజేయాల్సిన బాధ్యత ఉక్కు భూసేకరణ అధికారులకు లేదా అని ప్రశ్నించారు. సమాచారం ఇవ్వడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారన్నారు. దరఖాస్తుదారులను చులనన భావనతో చూస్తున్నారని ఆరోపించారు. సమాచార హక్కుచట్టంలో సమాచారం కోరడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని గుర్తించాలన్నారు. ఎంతో అవసరం, ఉపయోగవంతమైన ఈ చట్టాన్ని అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల ప్రజలక ఎంతో నష్టమన్నారు.

దుర్గమాంబ ఆలయంలో పూజలు

అగనంపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరసర ప్రాంత గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని పసుపు, కుంకుమలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. స్థానిక బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు ఆలయంలో లలితా పారాయణం, విష్ణుసహస్ర నామ పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేశ్, పారాయణ సేవా సమితి ఆర్గనైజర్ చిత్తా రామారావు తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 24, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 28, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 20, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 30, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28,కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండ ఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర 4, తోటకూర 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	98
ఫారం ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

దడ పుట్టిస్తున్న తోకాడ రహదారులు

- కొన్నేళ్లుగా నిర్వహణ లేకపోవడంతో దారుణంగా తయారైన రోడ్లు
- తరచూ ప్రమాదాలతో భయాందోళన
- మరమ్మతుకు గురవుతున్న వాహనాలు



రాళ్లు తేలిన రహదారి



పెద్ద పెద్ద గుంతలతో తోకాడ మార్గం

ఆటోనగర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆటోనగర్ సమీపంలోని తోకాడలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ఈ రహదారుల్లో ఎక్కడ చూసినా అడుగుకో గొయ్యి కనిపిస్తోంది. గోతులతో నిండిన రహదారులపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని వాహ నదారులు వాపోతున్నారు. తరచూ వాహనాలు మరమ్మతుకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ వేలాది



రోడ్డు మధ్యలో ఏర్పడిన పెద్ద గొయ్యి

వాహనాలు తిరిగే ఈ రహదారులు ఎప్పటి నుంచి దారుణంగా తయారయ్యాయి. పలుమారు ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోతోందని స్థానికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇంజనీరింగు కళాశాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు, వివిధ కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, గ్రీన్‌సిటీ, దువ్వాడ, పకీరుతఖ్యా, యాదవ జగ్గరాజు పేట, సత్తివానిపాలెం, నరవ, గవర జగ్గయ్యపాలెం, షీలానగర్ వెళ్లే వాహనదారులు, కార్మికులకు ఇబ్బందులు తప్పడం లేదు. రోడ్లు బాగా లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య, తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీఎస్‌ఈజెడ్‌కు వెళ్లే పలు కర్మాగారాల కార్మికుల అవస్థలు వర్ణనాతీతం.

గత కొన్నేళ్లుగా ఆటోనగర్ అభివృద్ధిని ప్రజాప్రతినిధులు, అధికారులు గాలికొదిలేశారని, దీంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో వెనుకబడిందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా.. రహదారుల గురించి పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని మండిపడుతున్నారు. రహ దారుల పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే.. రాత్రి వేళల్లో కొందరు ఆకతాయి యువకులు బైక్‌లపై వేగంగా వెళుతూ బెంబేలెత్తిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అయితే పోలీసులు మాత్రం కిమ్మనడం లేదని విమర్శిస్తున్నారు. ఇటీవల ఐలా కమిషనర్ ఎ.కిశోర్ ఈ రహదారులను పరిశీలించారు. తమ ప్రాంతంలో రహదారులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆటోనగర్ వాసులు కోరుతున్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారం

డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు



సదస్సులో పాల్గొన్న డిప్యూటీ కలెక్టర్, అధికారులు

అగనంపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : భూసమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని డిప్యూటీ కలెక్టర్, గాజువాక మండల ప్రత్యేకాధికారి ఎ.మధుసూదనరావు పేర్కొన్నారు. కొండయ్యవలసలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూ యజమానులు సమస్యలను దరఖాస్తు ద్వారా రెవెన్యూ అధికారులకు తెలియజేయాలన్నారు. దరఖాస్తులు పరిశీలించిన అనంతరం 45రోజుల్లోగా సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ బి.శ్రీనివాసరావు, ఆర్ఐలు అప్పారావు, మోహన్, దేవదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ కృష్ణారావు, సచివాలయం సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

‘ఆధ్యాత్మిక జీవనంపై చైతన్యం రావాలి’

పెదగంట్యాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక జీవనంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విశాఖ విభాగ్ శారీరక ప్రముఖ్ మంథా సుబ్బారావు పేర్కొన్నారు. అందుకు వీహెచ్‌పీకి చెందిన ప్రతి సభ్యుడు ఆధ్యాత్మికతపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు. వీహెచ్‌పీ పెదగంట్యాడ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్ధేశ్వరం కనకదుర్గామాత అలయ ప్రాంగణంలో నిర్వహించిన హైందవ శంఖారావ సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనమంతా ఆధ్యాత్మిక భావనతో జీవించాలన్నారు.

కార్యక్రమంలో వీహెచ్‌పీ పెదగంట్యాడ శాఖ సభ్యులు గొందేశి గురప్పరెడ్డి, గొందేశి గోవింద్, గొరుసు అప్పారావు, పద్మావతి, శ్రీదేవి, పి.దేవి, పట్నాయకుని రామారావు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో జడ్సీ పర్యటన

సింధియా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 62వ వార్డు పరిధిలో గల ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం జోనల్ కమిషనర్ రాము పర్యటించారు. ఆయనకు టీడీపీ వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు డ్రైనేజీ సమస్యలు, తాగునీటి కొరత తదితర సమస్యలను వివరించారు. దీనిపై జడ్సీ స్పందిస్తూ త్వరలోనే ఈ సమస్యల పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు జీవీఎంసీ సిబ్బంది, కూటమి నేతలు పాల్గొన్నారు.

1991 బ్యాచ్ స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల సమ్మేళనం



34 ఏళ్ల అనంతరం కలుసుకున్న ప్లాంటు ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 1991లో విధుల్లో చేరిన ఉద్యోగుల ఆత్మీయ కలయిక శుక్రవారం ప్లాంట్ ఇనుస్ట్రుమెంటేషన్ విభాగం వద్ద జరిగింది. ఈ సందర్భంగా కార్మిక నాయకుడు యేల్లేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ సంస్థ ప్రగతిలో ప్రతి ఉద్యోగిది కీలకపాత్ర అని పేర్కొన్నారు. జీతాలు సమయానికి అందకపోయినా నిరుత్సాహపడకుండా ఆత్మస్థైర్యంతో విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు బకాయిలతో పాటు జీతాలు సక్రమంగా ఇవ్వాలన్నారు. ఉద్యోగులు ఐక్యంతో ప్లాంట్‌ను లాభాల బాటలోకి తీసుకెళ్దామని, ప్రైవేటీకరణకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలు విభాగాల కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం



అగనంపూడి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాలస కాలనీ కొత్తపాలెంలో గల శ్రీఆంజనేయస్వామి ఆలయం 11వ వార్షికోత్సవం శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి వారికి నూతన వస్త్రాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు, భజన కార్యక్రమాన్ని జరిపారు. ఆలయ ధర్మకర్తలు బొబ్బరి అప్పలరాజు, నూకాలమ్మ, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు



కూర్మన్నపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 87వ వార్డు రాజులపాలెం కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, 88వ వార్డు వైజాగ్ ప్రొఫైల్స్ గ్రీన్‌సిటీ శ్రీలక్ష్మీ ఆండాల్ సమేత శ్రీవైభవ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 16 నుంచి 2025, జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకులు ఇరగవరపు వాసుస్వామి తెలిపారు. శ్రీపాంచరాత్రి ఆగమ శాస్త్ర సంప్రదాయంలో మంగళ ధ్వని, వేద మంత్ర ఉచ్ఛరణల మధ్య ప్రత్యేక పూజలు, అమ్మవార్లకు సామూహిక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 16న ధనుర్మాస వ్రతం ప్రారంభిస్తారు. 17న గోదా రంగనాథాచార్యులకు అష్టోత్తర పూజ, 20న శ్రీలక్ష్మీ తల్లికి లక్ష కుంకుమార్చన, సప్త హారతులు, 25న మహా సుదర్శన హోమం, 27న లక్ష తులసీదళాలతో అర్చన, 1న చందన అలంకరణ సేవ, 2న శ్రీవారి కల్యాణం, తోమాల సేవ, పల్లకీ సేవ, 3న సహస్ర దీపాల అలంకరణ, ఊంజల్ సేవ, 4న అష్టోత్తరాలతో పంచామృతాభిషేకాలు, 8న నవనీత అలంకరణ, దర్శనం, 10న వైకుంఠ ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, 11న 108 వెండి గంగాళాలతో కుడారై ఉత్సవం, పుష్పయాగం, 13న శ్రీగోదా రంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సన్నాహాలు చేస్తోంది.

‘విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి’



ఎగ్జిబిషన్ తిలకిస్తున్న స్టీల్‌ప్లాంట్ డీజీఎం (ఎఫ్ అండ్ ఏ) లీలా శ్రీనివాస్

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా ప్రోత్సాహం అందించడం ముఖ్యమని స్టీల్‌ప్లాంట్ డీజీఎం (ఎఫ్ అండ్ ఏ) లీలా శ్రీనివాస్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ డీపీఎస్ స్కూల్ వార్షిక ఎగ్జిబిషన్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రియేటివ్ ఆర్ట్స్, సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రాల ఆధారంగా అనేక ప్రాజెక్టులను విద్యార్థులు రూపొందించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ఎరోడైనమిక్స్, చెర్నోబిల్, పవర్‌ప్లాంట్, ఇస్రో ప్రయాణం, స్మార్ట్ సిటీ, జలియన్ వాలాబాగ్ ఉదంతం తదితర అంశాలపై ప్రాజెక్టులు, అలాగే మధుర మీనాక్షి గుడి, అయోధ్య రామ మందిరం వంటి ఆకృతులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీర్‌కుమార్ పాండే, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రాంతినగర్‌లో డ్రై డే-ఫ్రైడే



సూచలిస్తున్న జడ్సీ రాము, కార్పొరేటర్ చిన్నా

సింధియా, డిసెంబర్ 13, (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 63వ వార్డు పరిధి క్రాంతినగర్‌లో శుక్రవారం కార్పొరేటర్ గల్లా చిన్నా ఆధ్వర్యంలో డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ బి.రాము మాట్లాడుతూ..ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రెండు రోజులకొకసారి నీటి నిల్వలు శుభ్రపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ సునీల్, ఎస్.జనార్ధనరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పెందుర్తి రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు



60వ వార్డులో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ భుజంగరావు

ప్రభుత్వ స్థలాలను కాపాడండి

- రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశం
- 96వ వార్డులో రెవెన్యూ సదస్సు

పెందుర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూములు, స్థలాలను ఆక్రమించుకున్న వారిపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఆదేశించారు. 96వ వార్డు పెందుర్తిలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టణ ప్రాంతాల్లో విలువైన స్థలాలను కబ్జా చేస్తున్న వారు స్మార్ట్‌గా వ్యవహరించి కొన్ని పత్రాలతో కోర్టును ఆశ్రయించి స్థలాలను సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ సిబ్బంది కోర్టులో ఉందని వెనుకంజ వేస్తున్నారని, ఇటువంటి కేసుల్లో రెవెన్యూ శాఖ న్యాయ పోరాటం చేస్తే ప్రభుత్వ భూములు పరాధీనం కావని చెప్పారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవ్వకుండా కూటమి ప్రభుత్వం ప్రత్యేక ల్యాండ్ గ్రాబింగ్ చట్టం రూపొందించిందని తెలిపారు. అనంతరం భూ సమస్యలకు సంబంధించి స్థానికుల నుంచి 45 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు.తహసీల్దార్ ఆనంద్‌కుమార్, గొర్లె రామునాయుడు, వేగి పరమేశ్వరరావు, డీబీఎల్ నాయుడు, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

97 వార్డులో ఎమ్మెల్యే పర్యటన

97వ వార్డులోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే రమేశ్‌బాబు, కార్పొరేటర్ సేనాపతి వసంత శంకర్రావు. అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రమశక్తినగర్, సత్యనగర్. సాయినగర్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఆయా కాలనీల్లో కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని పబ్లిక్ వర్క్స్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అథీమ్ పార్క్ నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అవగడ్డ అప్పలనాయుడు, సేనాపతి సోమశేఖర్, శంకర్ ప్రసాద్, రమణమూర్తి, లైనాల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

60వ వార్డులో ..

మల్కాపురం : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసీల్దార్ భుజంగరావు అన్నారు. శుక్రవారం 60వ వార్డు మాజీ సైనికుల కాలనీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. మండలంలో ఎక్కువగా భూ వివాదాలు లేవని, ఉన్న వాటిని దశల వారీగా పరిష్కరిస్తున్నామని చెప్పారు. 22ఏలో ఉన్న భూ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ 5 కమిషనర్ రాము, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలపై కేంద్రం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

మధురవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జమిలి ఎన్నికలకు అనుకూలంగా కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని ఎన్డీఏ ప్రధాన భాగస్వామ్యపక్షంగా స్వాగతిస్తున్నామని మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మధురవాడ శిల్పారామంలో చేనేత మేళాను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏటా ఎక్కడో ఒకచోట ఎన్నికల నిర్వాహణ వల్ల పరిపాలన నెమ్మదిస్తుందన్నారు. ఒక దేశం-ఒక ఎన్నిక...విధానం వల్ల ఆ ఇబ్బందిని అధిగమించవచ్చునన్నారు. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ ఇప్పటికే నివేదిక ఇచ్చిందని, పార్లమెంటులో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటారని పేర్కొన్నారు. ముత్తంశెట్టి రాజీనామాపై మీడియా అడిగిన ప్రశ్నకు బదిలిస్తూ...వైసీపీ అధికారం కోల్పోయినందున రాజీనామా చేసి ఉండవచ్చునని వ్యాఖ్యానించారు. ఆయన ఏ పార్టీలో చేరుతారో ఆయన ఆప్షన్ అన్నారు.

జీవీఎంసీ దుకాణాలకు రహస్యంగా వేలం

- స్టాండింగ్ కమిటీ అనుమతి లేకుండా ప్రారంభం
- అధికారుల తీరుపై విమర్శలు

మల్కాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీహరిపురంలో జీవీఎంసీకి చెందిన మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్‌లో 14, 29, 30 దుకాణాలకు గురువారం రహస్యంగా వేలం నిర్వహించారు. వేలంలో దుకాణాలను దక్కించుకున్నప్పటికీ స్టాండింగ్ కమిటీ అనుమతి ఇచ్చిన తరువాతే వ్యాపారులు దుకాణాలు తెరవాలి. కానీ కమిటీ అనుమతి లేకుండానే 14వ నంబర్ షాప్‌ను శుక్రవారం తెరిచారు. వాస్తవానికి షాప్ నంబర్ 14ను గతంలో దక్కించుకున్న వ్యాపారి షాప్ లీజును రద్దు చేసుకుంటున్నట్టు వారం రోజుల క్రితమే జీవీఎంసీ అధికారులకు లేఖ సమర్పించారు. ఇది జరిగిన తరువాత అధికారులు ఆ షాప్‌లో ఉన్న సామగ్రిని బయటకు తీయించి, తాళం వేయాలి. కానీ ఏవీ జరగలేదు. గతంలో ఈ దుకాణం అద్దె రూ. 10 వేలు ఉండేది. గురువారం జరిగిన వేలంలో ఈ దుకాణాన్ని కూడా పెట్టారు. ఎవరైతే షాప్‌ను రద్దు చేసుకుంటున్నట్టు లేఖ ఇచ్చారో అదే వ్యక్తి మరొకరితో ఈ షాప్‌ను పాడించి, రూ. 10 వేల ఉన్న అద్దెను రూ. 7,800కు దక్కించుకున్నాడు. కాగా నెల రోజుల క్రితం ఓ వ్యాపారి 15వ నంబర్ షాప్‌ను వేలంలో దక్కించుకున్నాడు. అతనికి ఇప్పటివరకు ఆర్డర్ కాపీ ఇవ్వలేదు. అధికారులను అడిగితే స్టాండింగ్ కమిటీ అనుమతి పొందాలని చెప్పారు. కానీ 14వ నంబర్ షాప్ తెరవడానికి ఏవిధంగా అనుమతి వచ్చిందో తెలియడం లేదు. ఈ విషయమై ఆర్వో రమణను వివరణ కోరగా విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగిసిన తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సింహగిరిపై ఈనెల 9 నుంచి జరుగుతున్న విశిష్టాద్వైత మత వ్యాపకులు తిరుమంగై ఆళ్వార్ తిరు నక్షత్ర పూజలు శుక్రవారంతో ముగిసాయి. ప్రభాతారాధనలు తరువాత గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులు, ఆళ్వార్లతో వేదికపై అధిష్టింపజేశారు. మధ్యాహ్నం రాజభోగ నివేదన తరువాత తిరు నక్షత్ర పూజలు ముగించారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ అబ్రహం వర్గీస్, తదితరులు


ఎన్ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛతా శ్రమదాన్

గోపాలపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఎస్‌టీఎల్‌లో నిర్వహిస్తున్న స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్వచ్ఛతా శ్రమదాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భవనాలు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీల పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమం ఆదివారం వరకూ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రెసిడెంట్ ఏ. సునీల్, కార్యదర్శి అంకిత్ శర్మ, వర్క్స్ కమిటీ సభ్యులు అలోక్ చంద్, బలరామ్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి వెంకటాద్రిపై ధనుర్మాసోత్సవాలు

పెందుర్తి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెందుర్తిలోని వెంకటాద్రి శిఖరంపై ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి వచ్చేనెల 13 వరకు ధనుర్మాసోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 1న స్వామివారికి నవనీత అలంకరణ, 5న సుదర్శన హోమం, గోదాదేవి అమ్మవారికి కుంకుమ పూజ, అన్నసమారాధన, 10న వైకుంఠ ఏకాదశి, వెంకటాద్రి గిరి ప్రదక్షిణ, 11న కూడారై ఉత్సవం, 12న స్వామివారి తిరువీధి 13న సుదర్శన కల్యాణ మండపంలో గోదా రంగనాథుల కల్యాణం నిర్వహించనున్నారు.

నాయుడుతోటలో...



కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం

వేపగుంట : నాయుడుతోట రవినగర్‌లో కొలువైన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని ధనుర్మాసోత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. 16న ఉదయం 6.44 గంటలకు ఘంటారావంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిరోజూ తెల్లవారుజామున 5 నుంచి సేవాకాలం తిరుపళ్లయే జొచ్చి విన్నపం,తిరుప్పావై, శాత్తుమొరై తదితర సేవలను జనవరి 9 వరకు నిర్వహించనున్నారు. జనవరి 10న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉదయం 5 నుంచి ఉత్తర ద్వార దర్శనం, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ, ఊంజల్ సేవ కార్యక్రమాలు చేపట్టనున్నారు. 11న కూడారై ఉత్సవంలో భాగంగా స్వామివారికి 108 పాత్రలతో క్షీరాన్న నివేదన, 13న గోదా రంగనాథుల కల్యాణం, మహా అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ బండారు ప్రసాద్ తెలిపారు.

వ్యాపారుల మానవత్వం

మల్కాపురం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీహరిపురం యారాడ పార్కు సమీపంలో ఉన్న వ్యాపారులు శుక్రవారం గాలి కామరాజురెడ్డి పెద్ద కర్మ నిర్వహించారు. కామరాజు రెడ్డి సొంతూరు తెలీదు. ఆయనకు ఎవరూ లేరు. కొద్ది రోజుల క్రితం ఇక్కడికి రాగా వ్యాపారులు అతని వివరాలు ఆరా తీసి, అక్కున చేర్చుకున్నారు. ప్రతిరోజూ భోజనం పెట్టేవారు. ఈనేపథ్యంలో ఈనెల 2వ తేదీన ఆయన అనారోగ్యంతో మృతి చెందారు. అప్పుడు వ్యాపారులంతా ఆయన మృతదేహానికి మల్కాపురం శ్మశానవాటికలో దహన సంస్కరణలు చేశారు. శుక్రవారం పెద్ద కర్మ కూడా చేసి, తమ మానవత్వాన్ని చాటుకున్నారు.

ఈవీ బైక్... ఈజీ రైడ్!



నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలకు పెరుగుతున్న ఆదరణ

- కొనుగోలుకు వినియోగదారుల ఆసక్తి
- నాలుగేళ్లలో 60 శాతం మేర పెరిగిన విక్రయాలు
- అందుబాటులో 20 కంపెనీల షో రూమ్‌లు, విభిన్న మోడల్స్
- ప్రతినెలా కొత్తగా రోడ్డెక్కుతున్న 500 వాహనాలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

చెవులు చిల్లులు పడే శబ్దం రాదు.. పర్యావరణానికి విఘాతం కలిగించే పొగ లేదు.. పెట్రోల్ బంకుల వద్ద క్యూలోనిల్చొని ఫ్యూయిల్ పోయించే పనిలేదు. కేవలం ఓ గంట చార్జింగ్ పెడితే సునాయాసంగా 80 కిలోమీటర్ల మేర సాఫీగా సాగిపోయే ఎలక్ట్రికల్ వాహనాలకు నగరంలో డిమాండ్ పెరుగుతోంది. అందుబాటులో వివిధ కంపెనీల షోరూమ్‌లు, విభిన్న మోడల్స్, ఆకట్టుకునే ఆఫర్లు, సర్వీసింగ్ సెంటర్లు ఉండడంతో పాటు ట్రాఫిక్‌లో హాయిగా సాగిపోయే వాహనం కావడంతో ఈవీల కొనుగోలుకు జనం ఆసక్తి చూపిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతోంది. నాలుగేళ్లతో పోలిస్తే ఎలక్ట్రిక్ స్కూటీలు, బైక్‌ల విక్రయాలు 60 నుంచి 70 శాతం మేర పెరిగినట్టు దుకాణాల యజమానులు చెబుతున్నారు. నాలుగేళ్ల కిందట నగర పరిధిలో నెలకు 50 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం కష్టంగా ఉండేదని, ప్రస్తుతం 400 నుంచి 500 వాహనాలు రోడ్డెక్కుతున్నాయంటున్నారు. నగరంలో సుమారు 20 కంపెనీల షోరూమ్‌లు ఉండగా ప్రతి షోరూమ్‌లో 50 వరకు వాహన విక్రయాలు సాగుతున్నాయంటున్నారు. గతంతో పోలిస్తే వాహనం ధరలు తగ్గుముఖం పట్టడం, మంచి మైలేజీ, సర్వీసింగ్ సెంటర్లు అందుబాటులోకి రావడంతో కొనుగోలుదారుల సంఖ్య పెరుగుతోంది. ద్విచక్ర వాహనాల్లో దాదాపు 95 శాతం స్కూటీలే అమ్ముడవుతుండగా, రెండు, మూడు కంపెనీలు మాత్రమే ఈవీ బైకులను విక్రయిస్తున్నాయి.



అందుబాటులో సర్వీస్

గతంలో ఎలక్ట్రిక్ వాహనాలపై మక్కువ ఉండి, కొనుగోలు చేసినా వారిని సర్వీసింగ్ సమస్య వెంటాడేది. దీంతో చాలామంది కొనుగోలుపై విముఖత వ్యక్తం చేసేవారు. కాగా ఉత్పత్తి కంపెనీలు పెరగడం, మార్కెట్‌లో పోటీ వాతావరణం నెలకొనడంతో ప్రస్తుతం ఆయా కంపెనీలన్నీ షోరూమ్‌తోపాటే సర్వీసింగ్ సెంటర్లను నెలకొల్పుతున్నాయి. అందుబాటులో మెరుగైన సేవలు లభిస్తుండడంతో కొనుగోలుదారుల సంఖ్య క్రమేణా పెరుగుతోందని ఓలా స్టోర్ మేనేజర్ మహేష్ వివరించారు.

ప్రముఖ కంపెనీల ఈవీలు

వాహన రంగంలో ఉన్న అనేకసంస్థలు వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాలను ఉత్పత్తి చేస్తున్నాయి. ఇటీవల ఈ జాబితాలోకి ప్రముఖ కంపెనీలు చేరాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బజాజ్, టీవీఎస్, ఏథర్ ఎనర్జీ, హీరో, క్వాంటమ్, యాసిర్, ఓలాతో పాటు మరో 12 కంపెనీలు ఎలక్ట్రికల్ స్కూటీలను ఉత్పత్తి చేసి, తమ షోరూమ్‌ల ద్వారా విక్రయాలు సాగిస్తున్నాయి. వివిధ వర్గాల వారు, ముఖ్యంగా యువతీ యువకుల అభిరుచులకు అనుగుణంగా స్కూటీలను డిజైన్ చేస్తుండడంతో మార్కెట్‌లో ఈవీల విక్రయాలు పెరుగుతున్నాయి.



అందుబాటులోకి ధరలు..

గతంలో ఎలక్ట్రిక్ స్కూటీల కనీస ధర రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఉండేది. ప్రముఖ కంపెనీలు వాహనాల ధరను తగ్గించి విభిన్నమైన మోడల్స్‌ను అందుబాటులోకి తెస్తున్నాయి. దీంతో ఆదరణ పెరుగుతోంది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ స్కూటర్లు రూ.80 వేల ప్రారంభ ధర నుంచి లభిస్తున్నాయి. గరిష్ఠంగా రూ.1.9 లక్షల వరకు మోడల్, ఫీచర్స్‌ను బట్టి మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. స్కూటీ మోడల్, ఫీచర్లు, బ్యాటరీ సామర్థ్యాన్ని బట్టి 80 నుంచి 170 కిలోమీటర్ల మైలేజీ వచ్చే వాహనాలు నగరంలో లభిస్తున్నాయి. మహిళలు, పురుషులు తేడా లేకుండా అధికశాతం మంది స్కూటీల కొనుగోలుకే ఆసక్తిచూపిస్తున్నారు.

ఫీచర్లు ఎన్నో..

ఎలక్ట్రిక్ వాహనాల్లో ఫీచర్లు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. ఫుల్ ఎల్ఈడీ లైటింగ్, టచ్ స్విచ్ గేర్, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, ఫోన్‌కాల్, మెసేజ్ అలెర్ట్, నావిగేషన్, క్రాస్ అలెర్ట్, జియో ఫెన్సింగ్, లాస్ట్ పార్కింగ్, లౌడ్‌స్పీకర్స్ వంటి అనేక ఫీచర్లున్నాయి. వీటితోపాటు కొన్ని స్కూటీలు ఖరీదును బట్టి మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నాయి.

మూడేళ్లుగా వినియోగిస్తున్నా..



మూడేళ్ల కిందట స్కూటీ కొనుగోలు చేశాను. చాలా బాగుంది. ఇప్పటివరకు పెద్దగా సమస్యలు రాలేదు. మొదట్లో సర్వీసింగ్‌కు ఇబ్బంది ఉండేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. నగరంలో ప్రతిరోజూ ఎక్కువ దూరం తిరిగే వారికి బాగా ఉపయోగపడుతుంది. రైడ్ సాఫీగా సాగుతుంది. శబ్దం ఉండదు. ఒకసారి చార్జింగ్ చేసుకుంటే 80 కిలోమీటర్లు వరకు తిరిగే వీలు. మూడేళ్లుగా స్కూటీ రైడ్‌ను ఎంజాయ్ చేస్తున్నా.

\- జె.వెంకటేశ్వర్లు, ఈవీ వినియోగదారుడు

పెట్ మాల్స్



వరుసగా పెట్ షాప్స్ దుకాణాలు

అక్కడ దొరికేవన్నీ పెంపుడు జంతువులకే

ప్రత్యేకత సంతరించుకున్న అప్పుఘర్ రోడ్

పెట్...ఇది స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. బంధువులు, స్నేహితులు, చుట్టుపక్కలవారు జాతి కుక్కలను పెంచుతుండడంతో తామూ ఖరీదైన బ్రీడ్‌లను తెప్పించి మరీ పెంచుకునేందుకు అనేకమంది ఉత్సాహం చూపిస్తున్నారు. పెట్స్‌ను సాకడమంటే ఆహారం పెట్టేసి వదిలేయడం కాదు...దానికీ ఓ లెక్కుంది. ప్రత్యేకమైన ఆహారం, స్నానానికి సబ్బులు, ఇలా చాలా లిస్ట్ ఉంది. ఇందుకోసం ప్రతినెలా ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాల్సిన పరిస్థితులున్నాయి.

\- ఎంవీపీకాలనీ, ఆంధ్రజ్యోతి



ఓ దుకాణంలో అమ్మకానికి పక్షులు

ఒకేచోట దుకాణాలు...

ఖర్చుకు వెనకాడకున్నా...ఇవన్నీ ఎక్కడ లభిస్తాయి...ఎన్ని దుకాణాలు తిరగాలనేది ప్రతి వారికీ సందేహమే. పెట్స్‌ను సాకేందుకు ఒకేచోట అనేక దుకాణాలుంటే...ఇలా పెంపుడు జంతువుల ప్రేమికులకు ఆనందమే. నగరంలో ఇలా పెంపుడు జంతువులకు అవసరమైనవన్నీ కొనుగోలు చేసేందుకు నగరంలో ప్రత్యేకంగా ఓ ప్రాంతం ఉంది. అక్కడ అన్నీ పెట్స్‌కు సంబంధించిన వస్తువులు అమ్మే దుకాణాలే...



ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ రోడ్డు పెంపుడు జంతువులకు పెట్టాల్సిన ఆహార పదార్థాలు, నీళ్లు పెట్టడానికి బౌల్స్, రెడీమేడ్ శాకాహారం, మాంసాహారం, నెయిల్ కట్టర్స్, వెంట్రుకలు కట్ చేయడానికి కత్తెర, ట్రిమ్మర్, టూత్ బ్రష్, టూత్ పేస్ట్, బాత్ టబ్, షాంపూ, దువ్వెన, బెల్ట్, చైన్, సబ్బులు, తువ్వాలు, మ్యాట్స్, కాలర్ ఐడీ, బొమ్మలు లాంటి వస్తువులన్నీ లభ్యమవుతాయి. కుక్కలను వేడి, చలి నుంచి కాపాడేందుకు వీలుగా వివిధ రకాల వస్త్రాలు కూడా ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

పెట్‌కు డిజైనర్ వేర్...

ఫ్యాషన్ షో కోసమో, సరదాగా తిప్పడానికి కుక్కలను బయటకు తీసుకువెళ్లే వారి సంఖ్య ఎక్కువే. ఇందుకోసం ప్రత్యేకంగా డిజైనర్ వేర్ లభిస్తున్నాయి. రూ.వంద నుంచి ప్రారంభమై రూ.వేలల్లో పలికే కుక్కల కాస్ట్యూమ్స్ ఇక్కడ దుకాణాల్లో ఉన్నాయి. వాటితో పాటు వివిధ బ్రీడ్‌ల పప్పీలు, పిల్లులు, చెవుల పిల్లులు, చేపలు, తాబేళ్లు,విదేశీ పక్షులు, వాటి కోసం పంజరాలు విక్రయానికి ఉన్నాయి.



పక్షుల కోసం పంజరాలు

చేనేత కళాకారులను ఆదుకోవాలి

- భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన ప్రారంభం

మధురవాడ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన చేనేత వస్త్రాలను ధరించి కళాకారులను ఆదుకోవాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ శిల్పారామంలో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆయన శుక్రవారం ప్రారంభించారు. రానున్న పండుగల సందర్భంగా ప్రదర్శనలో ఉంచిన వస్త్రాలు కొనుగోలు చేసి కళాకారులకు చేయూత నివ్వాలని కోరారు. మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 60 మంది కళాకారులు తమ ఉత్పత్తులను ఈ నెల 26 వరకు ప్రదర్శిస్తారని శిల్పారామం ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కల్చరల్ సొసైటీ చైర్‌పర్సన్ చేరెడ్డి మంజుల తెలిపారు. శిల్పారామం సీఈఓ వి.స్వామినాయుడు మాట్లాడుతూ మంగళగిరి, ఉప్పాడ, పోచంపల్లి, సిద్దిపేట, ధర్మవరం తదితర ప్రాంతాలకు చెందిన చీరలు, కశ్మీర్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన బెడ్‌షీట్లు, కాటన్‌డ్రెస్ మెటీరియల్, పట్టుచీరలు ఉత్పత్తి ధరలకే అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం ఏఓ విశ్వనాథరెడ్డి, టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.



స్టాల్‌లో వస్తువులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

'గడువులోగా ప్రాజెక్టులు పూర్తికావాలి'

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వీఎంఆర్‌డీఏ చేపట్టిన అన్ని ప్రాజెక్టులు నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ సూచించారు. రెండు శాఖల ఉన్నతాధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రాజెక్టులకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భోగాపురం విమానాశ్రయానికి త్వరగా చేరుకోవడానికి అనుసంధానించిన రహదారుల నిర్మాణంపై దృష్టి పెట్టాలన్నారు. ప్లానింగ్ విభాగానికి లేఅవుట్లు, భవన నిర్మాణాలకు వచ్చే దరఖాస్తులకు అనుమతులు ఇవ్వడంపై అశ్రద్ధ తగదన్నారు. భూ వినియోగ మార్పిడి దరఖాస్తులపై తక్షణం స్పందించాలన్నారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ చేపట్టబోయే సింగిల్ విండో విధానంపై దరఖాస్తుదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ బలరామరాజు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘాలకు ఎన్నికలు

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 29 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు జరగనున్నాయి. ఆయా సంఘాల పరిధిలో 174 ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులకు ఎన్నికలు నిర్వహిస్తారు. మొత్తం 18,834 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ప్రతి సంఘం పరిధిలో ఓటర్లను సమావేశపరిచి ఏకాభిప్రాయంతో ఎన్నికలకు ప్రయత్నిస్తారు. కుదరకపోతే చేతులెత్తే ప్రక్రియ,కాదంటే రహస్య బ్యాలెట్ విధానంలో ఎన్నికలు చేపడతారు. 29 మంది అధికారులు, 29 మంది సహాయ అధికారులు, 58 మంది సహాయకులు విధులు నిర్వహిస్తారు. ప్రతి సంఘానికి ఆరుగురు ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను ఎన్నుకోవాలి. తరువాత వారిలో ఒకర్ని అధ్యక్షుడిగా, మరొకరిని ఉపాధ్యక్షుడిగా అదే రోజు ఎన్నికుంటారు. ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తిచేశామని నోడల్ అధికారి జె.స్వామినాయుడు తెలిపారు.

సచివాలయాల్లో అవసరానికి మించి సిబ్బంది

- కౌన్సిల్ సమావేశంలో చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా
- జీవీఎంసీ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి



వెంకటేశ్వర కాలనీ సచివాలయంలో గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బందిపై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని, తాను అన్నీ వాస్తవాలే మాట్లాడానని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. రోజంతా సచివాలయంలో ఉండి తమ సమస్యలను తెలుసుకోవాలని సిబ్బంది చేసిన సూచనకు స్పందించిన ఆయన శుక్రవారం వెంకటేశ్వర కాలనీ సచివాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ కూర్చుని సిబ్బంది విధులు, ఇతర సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో 578 సచివాలయాలు ఉండగా, అందులో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ప్రభుత్వం చెల్లిస్తున్న జీతాలకు, వారు అందిస్తున్న సేవలకు, వస్తున్న ఆదాయానికి పొంతన లేకుండా పోయిందన్నారు. 69వ వార్డులో గతంలో ఒక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ వసూలుచేసే ఆస్తి పన్నును ప్రస్తుతం ఏడుగురు సచివాలయ సిబ్బంది చేస్తున్నారన్నారు. అవసరానికి మించి సచివాలయాలు ఉండడంతో సిబ్బందికి పూర్తిస్థాయి విధులు లేకుండా పోయాయన్నదే తనతో పాటు ప్రజాభిప్రాయమన్నారు. సచివాలయ సిబ్బందికి కూడా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే బదిలీలు చేపట్టి, వార్డుల్లో సచివాలయాల సంఖ్యను తగ్గించాలన్నారు. మిగులు సిబ్బందిని ఇతర ప్రభుత్వ విభాగాలకు సర్దుబాటు చేసి, వారి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తాను అధికారులను కోరుతున్నానన్నారు. కౌన్సిల్‌లో తాను చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన సూచనలను సచివాలయాల సిబ్బంది తప్పుగా అర్థం చేసుకుని, ఆందోళనలకు దిగడం సరికాదన్నారు.



ప్రత్యేక జ్యూవెలరీ, వస్త్రాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

16,17న నోవాటెల్‌లో హాయ్ లైఫ్ ఎగ్జిబిషన్


విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పేరొందిన బ్రాండ్లకు చెందిన జ్యూవెలరీ, హోండెకర్, పెళ్లి దుస్తుల ఎగ్జిబిషన్‌ను ఈనెల 16, 17 తేదీలలో నగరంలోని నోవాటెల్‌లో హాయ్ లైఫ్ పేరుతో ఏర్పాటుచేస్తున్నారు. ఆకర్షణీయమైన డిజైన్లతో ఏర్పాటు చేస్తున్న ఈ ఎగ్జిబిషన్‌ను నగరవాసులు వినియోగించుకోవాలని నిర్వాహకులు కోరారు.

రైతు సమస్యలను తక్షణం పరిష్కరించాలి

- డీఆర్వోకు వినతిపత్రం అందజేసిన వైసీపీ నేతలు

విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ డిమాండ్ చేశారు. 'రైతన్నకుతోడుగా' పేరుతో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డులను పట్టుకుని జిల్లా పరిషత్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేశారు. వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గేటు వద్ద తోపులాటతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య చేతికి స్వల్ప గాయమైంది. అనంతరం పోలీసులు ముఖ్యనేతలను మాత్రమే లోపలకు అనుమతించారు. కలెక్టర్ లేకపోవడంతో డీఆర్ఓ భవానీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమర్‌నాథ్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రైతులకు తక్షణం రూ.20వేలు ఇవ్వాలని, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన తెలియజేస్తామని చెప్పినా పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, పండుల రవీంద్రబాబు, మేయర్ జి.హరివెంకట కుమారి, డిప్యూటీ మేయర్ జి.శ్రీధర్, మాజీ ఎమ్మెల్యేలు టి.విజయ్‌కుమార్, ఎం.విజయ్‌ప్రసాద్, సీహెచ్.వెంకటరామయ్య, వి.గణేష్‌కుమార్, నేతలు వెంకటరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కె.లతామాధురి, స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తు

గాజువాక, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో నేరాలకు పాల్పడుతున్న నిందితుడిని, చోరిసొత్తును కొనుగోలు చేసిన మరో వ్యక్తిని గాజువాక క్రైం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. క్రైం డీసీపీ కె.లతామాధురి తెలిపిన వివరాలిలావున్నాయి. గాజువాక సింహగిరి కాలనీలోని పి.కుసుమకుమారి ఇంట్లో ఈ నెల 5న 20 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి వస్తువులు చోరీకి గురయ్యాయి. గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ కె.శ్రీనివాసరావు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. స్థానికంగా సీసీ కెమెరాల ఫుటేజీ, నిందితుడు వినియోగించిన ద్విచక్రవాహనం ఆధారంగా దర్యాప్తు చేయగా కృష్ణా జిల్లా గుడివాడ జగనన్న కాలనీకి చెందిన పాత నేరస్థుడు ముద్దాని జగదీష్ అలియస్ జగన్ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. ఈ క్రమంలో శుక్రవారం గాజువాక బీసీ రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతున్న జగదీష్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్టు అంగీకరించాడు. చోరీ సొత్తును తణుకు సమీపంలోని పైడివాడ ప్రాంతానికి చెందిన ఇమంది జ్యోతిశివశ్రీకి విక్రయించినట్టు వివరించాడు. దీంతో పోలీసులు జగదీష్, చోరీ సొత్తును కొనుగోలు చేసిన జ్యోతిశివశ్రీని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. వారి నుంచి 25.7 తులాల బంగారు ఆభరణాలు, 50.5 తులాల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కాగా నిందితుడిపై ఇప్పటికే 14 కేసులున్నాయని, గుడివాడ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీటుందని, ఆన్‌లైన్ రమ్మీకు పద్దాడని పోలీసులు తెలిపారు. సమావేశంలో ఏసీపీ (క్రైం) లక్ష్మణరావు, గాజువాక క్రైం సీఐ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వసతి గృహాల మరమ్మతులకు 2.02 కోట్లు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు ప్రభుత్వం రూ.2.02 కోట్లు మంజూరు చేసింది. ఎంవీపీ కాలనీ, చినగదిలి వసతిగృహాలకు రూ.19.05 లక్షలు, గోపాలపట్నం రూ.13.92 లక్షలు, సీతమ్మధారలోని రెండు గృహాలకు రూ.7.68 లక్షలు, దక్షిణ నియోజకవర్గం పరిధిలో ఒక వసతి గృహానికి రూ.15.41 లక్షలు, పెందుర్తి రూ.8.65 లక్షలు, గాజువాకలోని రెండింటికి రూ.20.09 లక్షలు కేటాయించింది. భీమిలి, మధురవాడ, చిట్టివలస, ఆనందపురం, పరదేశిపాలెంలోని తొమ్మిది వసతిగృహాలకు రూ.1.17 కోట్లు కేటాయించారు. కలెక్టర్ పర్యవేక్షణలో పనులు జరగనున్నాయి.

చందమామను తాకేలా...



విశాఖపట్నం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో చాలా ఎత్తులో ప్రయాణించే జెట్ విమానం విడిచిపెట్టే పొగ చంద్రుడ్ని తాకేలా శనివారం రాత్రి నగరంలో కనువిందు చేసింది. భూమికి చంద్రుడు చాలా దూరంగా ఉంటారు. ఆకాశంలో జెట్ విమానాలు చాలా ఎత్తులో ప్రయాణిస్తుంటాయి.అయితే చంద్రుడికి తాకేలా జెట్ విమానం పొగ గీతలా కనిపించడం అరుదుగా జరుగుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

16 నుంచి అప్పన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు

సింహాచలం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ఈనెల 16 నుంచి ధనుర్మాసోత్సవాలు నిర్వహించనున్నామని ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. 16న ఉదయం 6.35 గంటలకు ఆలయ రాజగోపురంలో నెలగంట పెట్టడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. కాగా ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఈనెల 31 నుంచి జనవరి 17 వరకు పగల్‌పత్ ఉత్సవాలు, అంతర్భాగంగా ముక్కోటి ఏకాదశి, ధారోత్సవాలు, కనుమ పండుగ నాడు మకరవేట నిర్వహిస్తామన్నారు. ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు స్వామివారి తిరువీధి ఉత్సవాలు జరగాల్సి ఉన్నందున ఆయా తేదీల్లో ఆర్జిత సేవలను రద్దుచేస్తున్నట్టు ఈఓ ప్రకటించారు. జనవరి 10న ముక్కోటి ఏకాదశి నుంచి పదిరోజుల పాటు రాపత్ ఉత్సవాలు జరుగుతాయని, ప్రతిరోజు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పలు అవతారాల్లో అలంకరించి తిరువీధి నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో రాత్రి 7 గంటల వరకు మాత్రమే భక్తులకు స్వామి దర్శనాలు లభిస్తాయని, రాత్రి ఆరాధన టికెట్లు, ధనుర్మాసాన్ని పురస్కరించుని ఈనెల 16 నుంచి జనవరి 17 వరకు సుప్రభాత సేవ, ప్రభాత ఆరాధన టికెట్లను రద్దుచేస్తున్నామన్నారు. జనవరి 13న భోగి రోజున సాయంత్రం 5 గంటల నుంచి గోదా రంగనాథుల కల్యాణం జరగాల్సి ఉన్నందున ఆరోజు ఉదయం 9.30 గంటలకు జరిగే నిత్యకల్యాణాన్ని రద్దుచేస్తున్నామన్నారు.